దేశరాజధాని ఢిల్లీలో
ఈరోజు బంగారం ధర
తులం బంగారం
(10 గ్రాములు)
1,32,200/-
(22 క్యారెట్స్)
1,44,220/-
(24 క్యారెట్స్)


# ప్రజా వాయిస్

PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక

/ PRAJA VOICE

సంపుటి: 02 | సంచిక: 19 | ఎడిటర్: మేనం శ్యామ్ | శుక్రవారం 07-08-2026 | పేజీలు: 10


## సిరా చుక్క

### ఆన్‌లైన్ వీడ్కోలు

కన్నప్రేమను పంచిన చేతులు,
వ్యాపార సామ్రాజ్యం ఏలిన అడుగులు,
చివరికి మిగిలింది వృద్ధాశ్రమపు గోడల మధ్య...
ఒంటరి శ్వాసల నిశ్శబ్దం..
రూపాయి వెనక పరిగెత్తే లోకంలో
ప్రేమకు కూడా ధర కట్టేశారు.
ముగ్గురు కూతుళ్లు ఉన్న మహారాజుకు
ఆఖరి ప్రయాణంలో తోడు కరువైంది..
వందల మైళ్ల దూరం కాదేమో అడ్డంకి,
గుండెల్లో కరిగిపోయిన
ఈరమే అసలు కారణం..
కన్నతండ్రి కడతేర్చేందుకు
రూ.5100 డిజిటల్ చెల్లింపు...
ఆన్లైన్ స్క్రీన్ పై చివరి చూపులు...
అంత్యక్రియలు ఎప్పుడు ముగుస్తాయి....?
అప్పుడు కదా మేము అన్నం తినేది...
ఆ ఫోన్ సంభాషణలో ధ్వనించిన నైత్యం,
మనిషిలోని మమకారాన్ని చంపేసింది...
అస్థికలు ఏం చేయమంటారు....?
అంటే..తర్వాత చూద్దాం అన్న నిర్లక్ష్యం.
ఆస్తి తలా కాస్త పంచుకున్న చేతులు,
అస్థికలు తాకేందుకు కూడా వెనుకాడాయి...
మార్క్స్ అన్నది ఎంత నిజం..
"మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే...
"డబ్బు ఉంటే అన్నీ కొనవచ్చేమో,
కానీ కన్నపేగు అనురాగాన్ని కొనలేరు.
ఆధునికత మెరిసే రంగుల వెనుక
మనిషితనం నల్లబడిపోయింది,
అమ్మనాన్నల కడచూపును కూడా
ఫోన్ స్క్రీన్లకే పరిమితం చేసింది..

– రాగిపని బ్రహ్మాచారి,
నల్గొండ ..

# బీజేపీ తెలంగాణ కీలక నేతలు ఢిల్లీకి



- హైకమాండ్ పిలుపు
- రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఢిల్లీకి రావాలంటూ ఆదేశాలు
- పార్లమెంట్ సమావేశాల కోసం ఢిల్లీలో ఉన్న ఎంపీలు కూడా భేటీలో పాల్గొననున్నట్లు సమాచారం
- రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, నేతల సమన్వయంపై చర్చించే అవకాశం
- బీజేపీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్
- నితిన్ నబీన్‌కు నివేదిక సమర్పణ

**ప్రజా వాయిస్, న్యూఢిల్లీ:** తెలంగాణ బీజేపీ కీలక నేతలకు పార్టీ అధిష్టానం నుంచి అత్యవసర పిలుపు అందింది. రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావుతో పాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శుక్రవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ఇప్పటికే పార్లమెంట్ సమావేశాల కోసం జాతీయ రాజధానిలో ఉన్న బీజేపీ ఎంపీలు కూడా ఈ కీలక సమావేశంలో పాల్గొననున్నట్లు సమాచారం.

**రాష్ట్ర పరిస్థితులపై సమీక్ష**


తెలంగాణలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతం, నేతల మధ్య సమన్వయం, హైకమాండ్ ఇటీవల ఇచ్చిన ఆదేశాల అమలు తదితర అంశాలపై ఈ సమావేశంలో సమగ్రంగా చర్చించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

**అభయ్ పాటిల్ నివేదిక**

ఈ సమావేశానికి ముందు బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్ గురువారం పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌ను కలిసి రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ వ్యవహారాలపై సమగ్ర నివేదిక సమర్పించినట్లు సమాచారం.

**కీలక నిర్ణయాలపై ఆసక్తి**

ఈ భేటీ అనంతరం తెలంగాణ బీజేపీ భవిష్యత్ కార్యాచరణ, సంస్థాగత బలోపేతం, రాజకీయ వ్యూహాలపై కీలక నిర్ణయాలు వెలువడే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది.



## హైడ్రా కమిషనర్ సంతకం ఫోర్జరీ

- 52 జూనియర్ కళాశాలలపై చర్యలకు సిఫార్సు
- ఫైర్ ఎన్‌ఓసీలను నకిలీగా సృష్టించి అనుబంధ గుర్తింపు పొందే ప్రయత్నం
- హైడ్రా కమిషనర్ ఆర్.వి. రంగనాథ్ సంతకం ఫోర్జరీ చేసినట్లు గుర్తింపు
- 142 కళాశాలల పరిశీలనలో 52 నకిలీ ఫైర్ ఎన్‌ఓసీలు వెలుగులోకి
- పోలీసులకు ఫిర్యాదు
- 52 కళాశాలల గుర్తింపు రద్దు చేయాలని ఇంటర్ బోర్డుకు సిఫార్సు


ప్రజా వాయిస్, హైదరాబాద్:అగ్నిమాపక శాఖ అనుమతులు లేకుండా నడుస్తున్న కొన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలలు అనుబంధ గుర్తింపు (అఫిలియేషన్) కోసం నకిలీ ఫైర్ ఎన్‌ఓసీలను సమర్పించిన భారీ అక్రమం హైదరాబాద్‌లో వెలుగుచూసింది. ఈ వ్యవహారంలో హైడ్రా కమిషనర్ ఆర్.వి. రంగనాథ్ సంతకాన్నే ఫోర్జరీ చేసి నకిలీ ధ్రువపత్రాలు సృష్టించినట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో హైడ్రా అధికారులు పోలీసులకు

మిగతా 2లో

## కవాడిగూడలో కాలిపోయిన మృతదేహం కలకలం

- చెత్తకుప్పలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం
- దోమలగూడలో సంచలనం
- హత్య చేసి సాక్ష్యాలు చెరిపేందుకు తగలబెట్టారా? అన్న కోణంలో పోలీసుల దర్యాప్తు
- సీసీటీవీ ఫుటేజీలు, ఫోరెన్సిక్ ఆధారాలతో మిస్టరీ ఛేదించే ప్రయత్నం
- మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలింపు.. అన్ని కోణాల్లో విచారణ

2లో



## అమెరికా రాయబారితో సీఎం రేవంత్ భేటీ

- వీసా సమస్యలపై ప్రధాన చర్చ
- తెలంగాణ విద్యార్థులకు అమెరికా వీసాల సంఖ్య పెంచాలని రాయబారిని కోరిన సీఎం
- హెచ్-1బీ వీసా ప్రక్రియను సరళీకరించాలని విజ్ఞప్తి
- వీసా స్లాట్లు పెంచాలని అభ్యర్థన
- విద్య, ఉపాధి, పెట్టుబడులు, సాంకేతిక రంగాల్లో తెలంగాణ-అమెరికా భాగస్వామ్యంపై చర్చ
- ఐటీ, ఏఐ, లైఫ్ సైన్సెస్, స్టార్టప్‌ల్లో పెట్టుబడులకు తెలంగాణ సిద్ధమని సీఎం వెల్లడి



**ప్రజా వాయిస్, న్యూఢిల్లీ:** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి భారత్‌లోని అమెరికా రాయబారి సెర్జియో గోర్‌తో న్యూఢిల్లీలో మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. సుమారు 30 నిమిషాల పాటు సాగిన ఈ భేటీలో విద్య, ఉపాధి, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన రంగాల్లో తెలంగాణ–అమెరికా సహకారాన్ని మరింత విస్తరించే అంశాలపై చర్చించారు.ద్యార్థుల

**వీసా సమస్యలపై సీఎం ఫోకస్**

ఉన్నత విద్య కోసం అమెరికాకు వెళ్లే తెలంగాణ విద్యార్థులకు వీసాల సంఖ్యను పెంచాలని, వీసా అపాయింట్‌మెంట్లు సకాలంలో లభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రాయబారిని కోరారు. వీసా ఇంటర్వ్యూ స్లాట్లను

మిగతా 2లో

## రాయదుర్గం భూముల కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

- హైకోర్టు ఆదేశించిన డ్రోన్ సర్వేపై స్టే విధించిన సుప్రీంకోర్టు
- తదుపరి ఆదేశాలు వచ్చే వరకు యథాతథ స్థితి కొనసాగించాలని స్పష్టీకరణ
- హైకోర్టులో ఇంప్లీడ్ అయ్యేందుకు టీజీఐఐసీకి అనుమతి.. ఆగస్టు 14 వరకు గడువు
- 46 ఎకరాల భూమి వేలం వేసే ప్రతిపాదన లేదని సుప్రీంకోర్టుకు టీజీఐఐసీ వివరణ

2లో



## బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

### కల్వకుంట్ల కవిత

- సమాజంలోని వనరులు అందరికీ సమానంగా పంచుకోవడమే సామాజిక న్యాయమని వ్యాఖ్య
- రాష్ట్రంలో బీసీల జనాభా 56 శాతం ఉంటే 42 శాతం బిల్లు సరిపోదని కాంగ్రెస్‌పై విమర్శలు
- జ్యోతిరావు పూలే దంపతులకు భారతరత్న, ప్రొఫెసర్ జయశంకర్‌కు పద్మవిభూషణ్ ఇవ్వాలని తీర్మానం
- సామాజిక న్యాయం సాధించే వరకు అణగారిన వర్గాల కోసం జీవితాన్ని అంకితం చేస్తానని స్పష్టం



**ప్రజా వాయిస్, హైదరాబాద్:** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో నిర్వహించిన "సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ" లో పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సామాజిక న్యాయంపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ, సమాజంలోని వనరులు అందరికీ సమానంగా అందడమే నిజమైన సామాజిక న్యాయమని పేర్కొన్నారు.

**సామాజిక న్యాయం అంటే సమాన భాగస్వామ్యం**

సామాజిక న్యాయం అంటే అగ్రవర్ణాలకు వ్యతిరేకం కాదని, ప్రతి వర్గానికి సమాన అవకాశాలు, సమాన భాగస్వామ్యం కల్పించడమే లక్ష్యమని కవిత స్పష్టం చేశారు. "వంద మందికి వంద రొట్టెలు ఉంటే ఒక్కొక్కరికి ఒక్కటి దక్కడం న్యాయం. కానీ పది మంది 90 రొట్టెలు తిని, మిగిలిన 90 మంది 10 రొట్టెలు పంచుకోవడం న్యాయమా?" అంటూ అసమానతలపై ప్రశ్నించారు. అగ్రవర్ణ మిత్రులు కూడా ఈ అంశంపై ఒకసారి ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు.

**బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అవసరం**


తెలంగాణలో బీసీల జనాభా 56 శాతం ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ల బిల్లు తీసుకురావడం సరిపోదని

మిగతా 2లో

## శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద ప్రవాహం

- జూరాల నుంచి 2,20,948 క్యూసెక్కుల నీటి ప్రవాహం
- శ్రీశైలం జలాశయం నీటిమట్టం 869.20 అడుగులు.. నిల్వ 138.27 టీఎంసీలు
- పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు.. నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు
- ప్రాజెక్టుల నీటి వినియోగంపై నేడు చీఫ్ ఇంజినీర్ల కీలక సమావేశం

2లో



# భార్యపై కోపం.. నాలుగేళ్ల కుమారుడిపై తండ్రి దారుణం

- గుడిమల్కాపూర్‌లో హృదయ విదారక ఘటన
- చిన్నారిపై అమానుషంగా దాడి చేసిన తండ్రి
- పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే సమీపంలో పిల్లర్‌కు తల కొట్టి, రాయితో దాడి చేసినట్లు పోలీసుల వెల్లడి
- నిలోఫర్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్న బాలుడు.. పరిస్థితి విషమం
- నిందితుడు సల్మాన్ అరెస్ట్.. హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు

**ప్రజా వాయిస్, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలోని గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. భార్యతో జరిగిన కుటుంబ కలహాలను మనసులో పెట్టుకున్న ఓ వ్యక్తి తన నాలుగేళ్ల కుమారుడిపై అమానుషంగా దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన చిన్నారి ప్రస్తుతం నిలోఫర్ ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ప్రాణాలతో పోరాడుతున్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు సల్మాన్‌ను అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టారు.



### భార్యతో గొడవ.. కుమారుడిపై ప్రతీకారం

పోలీసుల వివరాల ప్రకారం.. గోల్కొండ ప్రాంతానికి చెందిన సల్మాన్ సెంటరింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అతనికి భార్య రుఖ్సానా బేగం, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆగస్టు 4 రాత్రి మద్యం మత్తులో భార్యతో తీవ్ర వాగ్వాదానికి దిగిన సల్మాన్, ఆమెతో పాటు అత్తపై కూడా దాడి చేసినట్లు పోలీసులు తెలిపారు. దీంతో రుఖ్సానా ఇద్దరు కుమార్తెలను తీసుకుని పుట్టింటికి వెళ్లగా, కుమారుడు మాత్రం తండ్రి వద్దే ఉన్నాడు.

### పిల్లర్‌కు తల కొట్టి.. రాయితో దాడి

మరుసటి రోజు ఉదయం తన సోదరుడి ఇంటికి తీసుకెళ్తానని చెప్పి బాలుడిని ఇంటి నుంచి తీసుకెళ్లిన సల్మాన్.. పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే సమీపానికి వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. అక్కడ బాలుడిని తలకిందులుగా పట్టుకుని ఎక్స్‌ప్రెస్‌వే పిల్లర్‌కు పలుమార్లు తల బలంగా కొట్టాడని, అనంతరం రాయితో తలపై దాడి చేసి నేలపై విసిరేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందన్నారు.

### వెంటిలేటర్‌పై చిన్నారి.. పరిస్థితి విషమం

తీవ్రంగా గాయపడిన బాలుడిని వెంటనే నిలోఫర్ ఆస్పత్రికి తరలించగా, ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. చిన్నారి తలకు తీవ్ర గాయాలయ్యాయని, న్యూరాలజీ నిపుణుల పర్యవేక్షణలో వైద్యం కొనసాగుతోందని వైద్యులు తెలిపారు. బాలుడి ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లు వెల్లడించారు.

### సల్మాన్ అరెస్ట్.. హత్యాయత్నం కేసు

బాలుడి తల్లి రుఖ్సానా బేగం ఫిర్యాదు మేరకు గుడిమల్కాపూర్ పోలీసులు నిందితుడు సల్మాన్‌ను అరెస్టు చేశారు. అతనిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. గతంలో కూడా సల్మాన్‌పై పలు దొంగతనం కేసులు నమోదైనట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనకు గల పూర్తి కారణాలు, కుటుంబ పరిస్థితులు తదితర అంశాలపై అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోంది.

# కవాడిగూడలో కాలిపోయిన మృతదేహం కలకలం



**ప్రజా వాయిస్, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కవాడిగూడ ప్రాంతంలో గురువారం ఉదయం గుర్తుతెలియని వ్యక్తి కాలిపోయిన మృతదేహం లభ్యం కావడంతో తీవ్ర కలకలం రేగింది. గోశాల సమీపంలోని చెత్తకుప్పలో మంటల్లో కాలిపోయిన మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి, పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనతో పరిసర ప్రాంతాల్లో భయాందోళనలు నెలకొన్నాయి.

### చెత్తకుప్పలో కాలిపోయిన మృతదేహం

స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అయితే అప్పటికే మృతదేహం పూర్తిగా కాలిపోయినట్లు అధికారులు గుర్తించారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

### హత్య కోణంలోనూ దర్యాప్తు

మృతదేహం వద్ద ఎలాంటి గుర్తింపు కార్డులు లేదా ఇతర ఆధారాలు లభించకపోవడంతో మృతుడు ఎవరు అనే విషయం ఇంకా తెలియరాలేదు. ఆత్మహత్యా? లేక హత్య చేసి సాక్ష్యాలు చెరిపివేసేందుకు మృతదేహాన్ని తగలబెట్టారా? అనే కోణాలతో పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

### సీసీటీవీ, ఫోరెన్సిక్ ఆధారాల పరిశీలన

ఘటన మిస్టరీని ఛేదించేందుకు పోలీసులు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు ఆ మార్గంలో సంచరించిన వాహనాల వివరాలను సేకరిస్తున్నారు. క్లూస్ టీమ్ ఘటనాస్థలం నుంచి ఫోరెన్సిక్ ఆధారాలను సేకరించి పరీక్షల కోసం పంపింది. స్థానికులను విచారిస్తూ అనుమానాస్పద కదలికలపై సమాచారం సేకరిస్తున్నారు.

### మృతుడి గుర్తింపుపై పోలీసుల దృష్టి

ఇటీవల నగరంలో నమోదైన మిస్సింగ్ కేసుల వివరాలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. మృతదేహాన్ని గుర్తించేందుకు ప్రజల సహకారం కోరుతూ, సంబంధిత సమాచారం తెలిసిన వారు వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు. కీలక ఆధారాల ఆధారంగా ఈ కేసును త్వరలోనే ఛేదిస్తామని దర్యాప్తు అధికారులు తెలిపారు.

# హైడ్రా కమిషనర్ సంతకం ఫోర్జరీ

మొదటి పేజీ తరువాయి

ఫిర్యాదు చేయడంతో పాటు 52 ప్రైవేట్ జూనియర్ కళాశాలల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డుకు సిఫార్సు చేశారు.

### 142 కళాశాలల తనిఖీల్లో భారీ అక్రమాలు

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని 142 జూనియర్ కళాశాలలు సమర్పించిన ఫైర్ ఎన్‌ఓసీలను హైడ్రా అధికారులు పరిశీలించగా, 90 ధ్రువపత్రాలు మాత్రమే అసలైనవిగా తేలాయి. మిగిలిన 52 ఫైర్ ఎన్‌ఓసీలు నకిలీవి, ఫోర్జరీ చేసినవ అని నిర్ధారించారు.

### హైడ్రా కమిషనర్ సంతకం ఫోర్జరీ

అనుబంధ గుర్తింపు పొందేందుకు కొందరు కళాశాలల యాజమాన్యాలు హైడ్రా కమిషనర్ ఆర్.వి. రంగనాథ్ సంతకాన్ని నకిలీగా తయారు చేసి ఫైర్ ఎన్‌ఓసీలు సృష్టించినట్లు విచారణలో తేలింది. ఈ చర్యను అధికారులు అత్యంత తీవ్రంగా పరిగణించారు.

### పోలీసులకు ఫిర్యాదు

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారులు పంపిన 76 ఫైర్ ఎన్‌ఓసీలను మొదటి విడతలో పరిశీలించగా, అందులో 7 ధ్రువపత్రాలు ఫోర్జరీ చేసినవిగా గుర్తించారు. దీంతో ఈ నెల 4న నెక్లెస్ రోడ్డులోని లేక్ పోలీస్ స్టేషన్‌లో హైడ్రా అధికారులు ఫిర్యాదు నమోదు చేశారు.

### 52 కళాశాలలపై చర్యలకు సిఫార్సు

నకిలీ ధ్రువపత్రాలతో విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న 52 ప్రైవేట్ జూనియర్ కళాశాలల అనుబంధ గుర్తింపును వెంటనే రద్దు చేయాలని హైడ్రా అధికారులు తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డుకు సిఫార్సు చేశారు. ఈ అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు దర్యాప్తు కొనసాగుతోంది.

# సెప్టెంబర్‌లో దేశవ్యాప్త 'క్యా బోల్తీ పబ్లిక్' కార్యక్రమం: సీజేపీ

- ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు దేశవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమం
- తొలి దశలో రాంచీ పర్యటనకు సీజేపీ ప్రతినిధుల బృందం
- ప్రజాభిప్రాయాల ఆధారంగా కార్యాచరణ రూపొందించనున్న పార్టీ
- స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కానున్న సీజేపీ

**ప్రజా వాయిస్, న్యూఢిల్లీ:** కాక్రోజ్ జనతా పార్టీ (సీజేపీ) తమ భవిష్యత్ రాజకీయ కార్యాచరణను ప్రకటించింది. దేశవ్యాప్తంగా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించే లక్ష్యంతో సెప్టెంబర్ నెలలో "క్యా బోల్తీ పబ్లిక్" పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించింది.

### దేశవ్యాప్తంగా ప్రజలతో ప్రత్యక్ష మమేకం

ఈ కార్యక్రమం ద్వారా దేశంలోని వివిధ రాష్ట్రాలు, నగరాలు, గ్రామాల్లో ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలు, అభిప్రాయాలు, ప్రభుత్వాల పనితీరుపై స్పందనను తెలుసుకోనున్నట్లు పార్టీ పేర్కొంది. ప్రజల సూచనలను ఆధారంగా చేసుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపింది.

### తొలి దశలో రాంచీ పర్యటన

కార్యక్రమంలో భాగంగా సీజేపీ ప్రతినిధుల బృందం తొలి దశలో జార్ఖండ్ రాజధాని రాంచీని సందర్శించనుంది. అక్కడ స్థానిక ప్రజలు, వివిధ వర్గాల ప్రతినిధులతో సమావేశమై సమస్యలను తెలుసుకోనున్నట్లు పార్టీ వెల్లడించింది.

### ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం, వాటికి పరిష్కార మార్గాలను రూపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని సీజేపీ తెలిపింది. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఈ కార్యక్రమాన్ని దశలవారీగా నిర్వహించనున్నట్లు పార్టీ వెల్లడించింది.

# బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి


కవిత విమర్శించారు. బీసీల జనాభాకు అనుగుణంగా 50 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని డిమాండ్ చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన సమయంలోనే ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీలకు కూడా రిజర్వేషన్లు అమలు చేసి ఉంటే భారత్ మరింత అభివృద్ధి చెందేదని అభిప్రాయపడ్డారు.

### అణగారిన వర్గాల కోసం జీవితాన్ని అంకితం

తాను అగ్రవర్ణంలో జన్మించడం తన చేతుల్లో లేని విషయం అయినప్పటికీ, అణగారిన వర్గాల సాధికారత కోసం పనిచేయడం మాత్రం తన నిర్ణయమని కవిత పేర్కొన్నారు. సామాజిక న్యాయం సాధించే వరకు వెనుకబడిన వర్గాల కోసం తన జీవితాన్ని అంకితం చేస్తానని స్పష్టం చేశారు. విదేశాల్లో భారతీయులపై వివక్షను ఖండించే మనం, మన సమాజంలో ఉన్న వివక్షను కూడా నిర్మూలించాలని పిలుపునిచ్చారు.

### పూలే దంపతులకు భారతరత్న ఇవ్వాలి

సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభలో పలు తీర్మానాలు చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతులకు భారతరత్న పురస్కారం ఇవ్వాలని, తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్‌కు పద్మవిభూషణ్ ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరాలని తీర్మానం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన అసలైన ఆశయమైన సామాజిక న్యాయాన్ని నెరవేర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రతిజ్ఞా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కల్వకుంట్ల కవిత ప్రకటించారు.



# కేసులు చేస్తే మాకు మామూలే

- రూ.10 వేల జరిమానా కడితే బండ్లు బయటకు వస్తాయి!
- మట్టి దళారుల బహిరంగ వ్యాఖ్యలు
- అద్రస్‌పల్లి, కేశ్వాపూర్‌లో జోరుగా అక్రమ మట్టి తవ్వకాలు అధికారులు మామూళ్ల మత్తులో ఉన్నారా...?
- ప్రజల్లో తీవ్ర ఆగ్రహం







**మేడ్చల్ జిల్లా, ప్రజా వాయిస్ ప్రతినిధి:** మేడ్చల్ జిల్లాలోని అద్రస్‌పల్లి మరియు కేశ్వాపూర్ గ్రామాల పరిసర ప్రాంతాల్లో అక్రమ మట్టి తవ్వకాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా భారీ వాహనాలతో మట్టిని తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ మట్టి తరలింపుపై ప్రశ్నిస్తే, "కేసు చేస్తే మాకు మామూలే... రూ.10 వేల జరిమానా కడితే మా బండ్లు మళ్లీ బయటకు వస్తాయి" అంటూ మట్టి దళారులు బహిరంగంగానే మాట్లాడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ వ్యాఖ్యలు అధికారుల పనితీరుపై అనేక అనుమానాలకు తావిస్తున్నాయని ప్రజలు అంటున్నారు.అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలుఇంత బహిరంగంగా అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత శాఖ అధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు దారితీస్తోంది. TS08 UF 3348, TS08 UH 2570 ఆనాలు సీజ్ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రజా వాయిస్ మేడ్చల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ స్టింగ్ ఆపరేషన్ చేసి గురువారం క్యాప్చర్ చేసిన ఫోటో.... అధికారులు మామూళ్ల మత్తులో ఉన్నారా అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని ప్రజల విజ్ఞప్తిఅక్రమ మట్టి తవ్వకాలను వెంటనే అరికట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు జిల్లా కలెక్టర్‌ను కోరుతున్నారు. ప్రజల ఆస్తులు, ప్రభుత్వ భూములు మరియు పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మూడు చింతలపల్లి మున్సిపల్ లావణ్య పట్టలు అక్రమ ప్రభుత్వ భూములనుంచి తవ్వకాలు చేస్తున్నారని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని మూడు చింతలపల్లి మున్సిపాలిటీ ప్రజలు కోరుతున్నారు.

# రాయదుర్గం భూముల కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

**ప్రజా వాయిస్, న్యూఢిల్లీ:** రాయదుర్గం భూముల వివాదంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ) దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం, తెలంగాణ హైకోర్టు ఆదేశించిన డ్రోన్ సర్వేపై తాత్కాలికంగా స్టే విధించింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు యథాతథ స్థితిని కొనసాగించాలని స్పష్టం చేసింది.

### డ్రోన్ సర్వేపై స్టే

తమ వాదనలు వినకుండానే హైకోర్టు డ్రోన్ సర్వేకు ఆదేశాలు జారీ చేసిందని టీజీఐఐసీ తరఫు సీనియర్ న్యాయవాది సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ధర్మాసనం ప్రస్తుతం డ్రోన్ సర్వే చేపట్టవద్దని ఆదేశిస్తూ స్టే మంజూరు చేసింది.

### హైకోర్టులో ఇంప్లీడ్ అయ్యేందు

కు అవకాశంఈ కేసులో హైకోర్టులో ఇంప్లీడ్ అయ్యేందుకు టీజీఐఐసీకి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. ఆగస్టు 14వ తేదీలోపు హైకోర్టులో సవరణ దరఖాస్తు దాఖలు చేసుకోవాలని సూచించింది. అనంతరం హైకోర్టు ఈ వ్యవహారాన్ని విచారించనుంది.

### 46 ఎకరాల భూమిపై స్పష్టీకరణ

రాయదుర్గం సర్వే నంబర్ 83/2లో ఉన్న 46 ఎకరాల భూమిని వేలం వేయాలనే ప్రతిపాదన ప్రస్తుతం లేదని టీజీఐఐసీ తరఫు సీనియర్ న్యాయవాది సుప్రీంకోర్టుకు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో భూముల వివాదంపై తదుపరి విచారణ వరకు ప్రస్తుత పరిస్థితిని కొనసాగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

# శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద ప్రవాహం

**ప్రజా వాయిస్, నాగర్‌కర్నూల్:** ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల ప్రభావంతో శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల ప్రాజెక్టు నుంచి శ్రీశైలానికి 2,20,948 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. దీంతో జలాశయంలో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది.

### 138.27 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ

ప్రస్తుతం శ్రీశైలం జలాశయం నీటిమట్టం 869.20 అడుగులు నమోదైంది. జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 138.27 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జలాశయం పూర్తి స్థాయి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలుగా ఉంది.

### నేడు చీఫ్ ఇంజినీర్ల కీలక సమావేశం

రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టుల్లో అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, నీటి వినియోగం, సాగు మరియు తాగునీటి అవసరాలపై చర్చించేందుకు రాష్ట్ర స్థాయి చీఫ్ ఇంజినీర్ల సమావేశం నేడు నిర్వహించనున్నారు. వాస్తవానికి ఈ సమావేశం నిన్న జరగాల్సి ఉండగా, వాయిదా పడిన నేపథ్యంలో ఈ రోజు నిర్వహించనున్నారు. నీటి లభ్యత, విడుదలలు, భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

# అమెరికా రాయబారితో సీఎం రేవంత్ భేటీ

మొదటి పేజీ తరువాయి

పెంచడంతో పాటు దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

### హెచ్-1బీ వీసా ప్రక్రియ సరళీకరణ కోరిన సీఎం

అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న తెలంగాణకు చెందిన నిపుణులు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. హెచ్-1బీ వీసా ప్రాసెసింగ్, రెన్యువల్, వీసా స్టాంపింగ్ ప్రక్రియలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని, వీసా నిబంధనల్లో మార్పులపై ముందుగానే సమాచారం అందించే విధానం ఉండాలని సూచించారు.

### పెట్టుబడులకు తెలంగాణ సిద్ధం

తెలంగాణలో అమెరికా కంపెనీలకు విస్తృత పెట్టుబడి అవకాశాలు ఉన్నాయని ముఖ్యమంత్రి వివరించారు. ముఖ్యంగా ఐటీ, కృత్రిమ మేధ (ఏఐ), లైఫ్ సైన్సెస్, ఫార్మా, స్టార్టప్‌లు, పరిశోధన, ఆధునిక సాంకేతిక రంగాల్లో భాగస్వామ్యానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

### విద్యా, పరిశోధన రంగాల్లో భాగస్వామ్యం విస్తరణ

అమెరికా విశ్వవిద్యాలయాలు తెలంగాణ విద్యా సంస్థలతో కలిసి పనిచేసేలా సహకరించాలని ముఖ్యమంత్రి కోరారు. విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు, సంయుక్త పరిశోధనలు, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తరించాలని రాయబారిని అభ్యర్థించారు.



## ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్ పారదర్శకంగా నిర్వహించాలి

- అర్హులందరికీ తప్పనిసరిగా ప్రయోజనం చేకూర్చాలి
- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్

**ప్రజా వాయిస్ పాల్వంచ** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల రూరల్ పరిధిలోని లక్ష్మీదేవిపల్లి-ఎస్, జగన్నాధపురం గ్రామపంచాయతీలలో గురువారం నాడు జిల్లా కలెక్టర్ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల అర్హతల పరిశీలన వెరిఫికేషన్ కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వెరిఫికేషన్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించి,ప్రతి దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలించి,నిజమైన అర్హులను గుర్తించి నిర్ణీత గడువులో వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రయోజనం అందేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. అనంతరం స్థానిక బసవతారక కలని, గ్రామ పంచాయతీలో నీ ఎం.పి.యు.పి.ఎస్. పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో మమేకమై భోజనం నాణ్యత, విద్యాబోధన, పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల బోధనా విధానాన్ని పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందేలా నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ మధు, పాల్వంచ మండల తహసీల్దార్ దారా ప్రసాద్, ఎంపీడీవో పి. రాజారావు, హౌసింగ్ పీడీ. సవే రామ్, హౌసింగ్ ఏఈ కుమారి పుష్పలత, ఎంఈఓ.ఏ.శ్రీరామ్ మూర్తి, మండల వ్యవసాయ శాఖ అధికారి శంభో శంకర్, స్థానిక గ్రామ పంచాయతీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# నంది వాగు ప్రాజెక్ట్ దశ మారనుందా..?

- పూర్తి పునరుద్ధరణకు ప్రతిపాదనలు
- 2,650 ఎకరాలకు మళ్లీ సాగునీటి ఆశ

**ప్రజావాయిస్ / మోమిన్‌పేట్** మోమిన్‌పేట్ మండల రైతుల ఎన్నో ఏళ్ల నిరీక్షణకు త్వరలో శుభవార్త అందే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు వేలాది ఎకరాలకు సాగునీటిని అందించి రైతులకు జీవనాధారంగా నిలిచిన నంది వాగు ప్రాజెక్ట్ పూర్తి పునరుద్ధరణ దిశగా అడుగులు వేస్తుండటంతో ఆయకట్టు రైతుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.1970లో నిర్మించిన నంది వాగు ప్రాజెక్ట్ ద్వారా సుమారు 2,650 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రాజెక్టును నిర్మించారు. అయితే కాలక్రమేణా కుడి, ఎడమ ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, తూములు పూడికతో నిండిపోవడం, మరమ్మతుల లేమి, నిర్వహణ లోపాల కారణంగా ప్రస్తుతం కేవలం 600 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతున్న పరిస్థితి ఏర్పడింది. దీంతో వందల ఎకరాల సాగుభూమి బీడుగా మారి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గత నెల 9వ తేదీన ఢిల్లీ నుంచి వచ్చిన సెంట్రల్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ నిపుణుల బృందం నంది వాగు ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పరిశీలించింది. డ్యామ్ భద్రత, ప్రధాన కాలువలు, చెరువు కట్ట, అలుగు, తూములు, ఇతర నిర్మాణాల పరిస్థితిని పరిశీలించి అవసరమైన మరమ్మతులు, భద్రతా చర్యలపై పలు సూచనలు చేసింది.తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ చొరవతో నంది వాగు ప్రాజెక్టును పూర్తిస్థాయిలో పునరుద్ధరించేందుకు చర్యలు వేగవంతమయ్యాయి. ప్రాజెక్టు అభివృద్ధితో పాటు గణేష్ ఘాట్, బతుకమ్మ ఘాట్ మెట్లు, మినీ ట్యాంక్‌బండ్ నిర్మాణాలకు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.సెంట్రల్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ సూచనలు, పరిసర ప్రాంతాల రైతుల అభిప్రాయాలు, ఇరిగేషన్ శాఖ సర్వే నివేదికల ఆధారంగా సమగ్ర ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. ప్రాజెక్టులోని ప్రధాన కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, తూములు, చెరువు



కట్ట, అలుగు, కింది భాగాల్లో మరమ్మతులు అవసరమైన ప్రాంతాలను అధికారులు గుర్తించారు. నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ అన్ని పనులు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.పరిపాలనా అనుమతులు, టెండర్ ప్రక్రియ పూర్తయిన వెంటనే మరమ్మతు పనులు ప్రారంభమయ్యే అవకాశముంది. పునరుద్ధరణ పూర్తయితే నంది వాగు ప్రాజెక్టు తన పూర్వ వైభవాన్ని సంతరించుకుని, 2,650 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే లక్ష్యం మళ్లీ నెరవేరుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయమై ఇరిగేషన్ శాఖ ఏఈఈ రవితేజను వివరణ కోరగా, "నంది వాగు ప్రాజెక్టు పునరుద్ధరణకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. అవసరమైన మరమ్మతులన్నీ చేపట్టేలా ప్రణాళిక రూపొందిస్తున్నాం. పరిపాలనా అనుమతులు వచ్చిన వెంటనే తదుపరి ప్రక్రియ ప్రారంభమవుతుంది" అని తెలిపారు.రైతుల ఆకాంక్షఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురైన నంది వాగు ప్రాజెక్టుకు మళ్లీ జీవం పోసి, పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆయకట్టు రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రాజెక్టు పునరుద్ధరణ పూర్తయితే సాగునీటి సమస్య తీరడంతో పాటు వ్యవసాయ ఉత్పాదకత పెరిగి, మోమిన్‌పేట్ మండల వ్యవసాయ రంగానికి కొత్త ఊపు వస్తుందని రైతులు ఆశిస్తున్నారు.

## స్థలాల పరిశీలనతోనే ముగిసిన ఎంపీవో విచారణ..!

- రికార్డుల జోలికి వెళ్లలేదని ఫిర్యాదుదారుల ఆగ్రహం

**ప్రజా వాయిస్ చిగురుమామిడి,:** కరీంనగర్ జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) ఆదేశాల మేరకు రేకొండ గ్రామపంచాయతీలో ప్రభుత్వ నిధుల దుర్వినియోగం, అక్రమాలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో చిగురుమామిడి ఎంపీవో కిరణ్ కుమార్ గురువారం రోజున క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు.విచారణలో భాగంగా ఫిర్యాదులో పేర్కొన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం సమీపంలోని బోరు, చెరువు కట్ట వద్ద మొక్కల ధ్వంసం,కాల్చిన చెట్లు తొలగింపు పేరుతో జరిగిన పనులను పరిశీలించారు.అయితే, ఫిర్యాదులో పేర్కొన్న గ్రామ పంచాయతీ తీర్మానాలు, బిల్లులు, వౌచర్లు, మెజర్‌మెంట్ బుక్స్ (ఎం.బి.), బ్యాంకు లావాదేవీలు, అనుమతి పత్రాలు తదితర కీలక రికార్డులను పరిశీలించకుండానే విచారణ ముగించారని ఫిర్యాదుదారులు ఆరోపించారు. క్షేత్రస్థాయి పరిశీలనతోనే సరిపెట్టి, రికార్డు ఆధారిత విచారణ నిర్వహించకుండా ప్రక్రియను ముగించారని వారు పేర్కొన్నారు.విచారణ అనంతరం ఎలాంటి విచారణ నివేదికను అందజేయకుండా, "20 రోజుల తర్వాత ఇస్తాం" అని మౌఖికంగా మాత్రమే తెలిపారని ఫిర్యాదుదారులు ఆరోపించారు. దీంతో విచారణ పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో సంబంధిత అన్ని రికార్డులను స్వాధీనం చేసుకుని, జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో తిరిగి సమగ్ర, నిష్పక్షపాత విచారణ నిర్వహించి, అక్రమాలు రుజువైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారులు కోరారు.





## తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి ఘనంగా నిర్వహణ

**ప్రజా వాయిస్ /నల్గొండ క్రైమ్:** తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రముఖ విద్యావేత్త, ఆర్థికవేత్త, ఉద్యమకారుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా నల్గొండ జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. అనంతరం జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది రెండు నిమిషాల మౌనం పాటించి ఆయన సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ గారని అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, ప్రాంతీయ అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ప్రజాసేవలో ఉన్న ప్రతి ఒక్కరూ ఆయన విలువలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి రమేష్,ఏ.ఓ శివ ప్రసాద్,ఎస్బి డిఎస్పీ మల్లారెడ్డి, ఏ.ఆర్ డిఎస్పీ శ్రీనివాసులు, సీఐ లు,ఆర్.ఐ లు , మినిస్టీరియల్ సిబ్బంది,మహిళా పోలీసు సిబ్బంది,మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ గారికి ఘన నివాళులర్పించారు.

## హన్మకొండ ప్రైవేట్ ఆసుపత్రిలో దారుణం

- చనిపోయిన వ్యక్తికి వైద్యం చేస్తున్నారంటూ బంధువుల ఆందోళన!
- ఓ..డాక్టర్ కమీషన్ల దందా - మొదటి ఆసుపత్రి నిర్లక్ష్యం.



**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** :డబ్బుల కోసం కక్కుర్తి పడి హన్మకొండ విజయ టాకీస్ సమీపంలోని ఓ.. ప్రముఖ ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యం మృతి చెందిన వ్యక్తికి వెంటిలేటర్ వైద్యం అందిస్తూ బిల్లులు వసూలు చేస్తోందని వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బుల్లికొండ గ్రామానికి చెందిన ఒక పేద కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది.కుటుంబ సభ్యులు తెలిపిన కథనం ప్రకారం... బాధితుడు: పంజాల శ్రీధర్ (32), తండ్రి: జలంధర్. ఇద్దరు చిన్న పిల్లలు వేదన్సీ (6), మహాన్సీ (3) ఉన్నారు. బంధువుల ఆరోపణ: బ్రెయిన్ క్లాట్ అయిన శ్రీధర్‌ను స్థానిక ఓ వైద్యుడు సిఫార్సుపై మొదట హనుమకొండలోని బాలసముద్రంలోఒక ప్రైవేట్ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం హనుమకొండ విజయ టాకీస్ రోడ్డు మరో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బ్రెయిన్ సర్జరీ ఆపరేషన్ చేయడం జరిగిందని, ఆపరేషన్ జరిగిన రెండు రోజుల నుండి పేషంటు నుండి ఎలాంటి కదలికలు చూపు స్పర్శ లేదని పేషెంట్ బంధువులు చెప్తున్నారు. పేషెంట్ పరిస్థితి ఏంటని వైద్యులను ప్రశ్నించగా చూద్దాం..! 95% గ్యారెంటీ లేదు అంటూ దాటివేత ధోరణి చేపడుతు..విపరీతంగా బిల్లులు వేయడంతో, "మేము అంత డబ్బు కట్టలేము, పేషెంట్ వాస్తవ పరిస్థితి ఏంటో చెప్పండి అంటూ బంధువులు కాళ్ళు పట్టుకున్నా యాజమాన్యం వదల్లేదని బాధితులు పేర్కొంటున్నారు. డబ్బులు కడితేనే బాడీని అప్పగిస్తామని నిర్బంధిస్తున్నట్లు సమాచారం. ఈనెల 4వ తారీఖు పేషంట్ శ్రీధర్ హనుమకొండవిజయ టాకీస్ రోడ్డుసమీపంలోని న్యూరో ఫిజీషియన్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీలో ప్రాసెస్ లో ఉన్న 70 వేల రూపాయలు వసూలు చేసినట్లు పేషంట్ కుటుంబ సభ్యులు తెలుపుతున్నారు. వైద్య పరిజ్ఞానం – అనుమానం: మెడికల్ నాలెడ్జ్ ప్రకారం మెదడు పూర్తిగా పనిచేయడం ఆగిపోయినప్పటికీ (బ్రెయిన్ డెత్ ), కృత్రిమ శ్వాస (వెంటిలేటర్ ) పై ఉంచినంత సేపు గుండె కొట్టుకుంటున్నట్లు అనిపిస్తుంది. వెంటిలేటర్ తీసేస్తే గుండె ఆగిపోతుంది. శ్రీధర్ అప్పటికే మరణించాడని, కేవలం బిల్లులు పెంచడం కోసమే కృత్రిమ శ్వాసపై ఉంచి నాటకమాడుతున్నారని బంధువులు బలంగా అనుమానిస్తున్నారు.తక్షణమే జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు, పోలీసులు స్పందించి ఈ ప్రైవేట్ ఆసుపత్రి దోపిడీపై విచారణ జరిపి, బాధితుడికి న్యాయం చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## క్రైమ్ పార్టీ పోలీసులపై ఫిర్యాదు.. చర్యలేవి?

- రూ.20 వివాదంలో మహిళపై దాడి చేశారన్న ఆరోపణలు
- పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు నమోదైనా ముందుకు సాగని విచారణ?
- రాజీ ప్రయత్నాలపై స్థానికుల్లో పలు అనుమానాలు.



**ప్రజా వాయిస్/తాండూరు.** వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో ఇద్దరు క్రైమ్ విభాగానికి చెందిన పోలీసు సిబ్బందిపై గత రెండు రోజుల క్రితం నమోదైన ఫిర్యాదు వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. రూ.20 వివాదంలో ఓ మహిళపై దాడి చేశారన్న ఆరోపణలతో సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు నమోదైనప్పటికీ, ఇప్పటివరకు సంబంధిత పోలీసు సిబ్బందిపై ఎలాంటి శాఖాపరమైన చర్యలు తీసుకున్నారన్న దానిపై స్పష్టత లేకపోవడం పలు ప్రశ్నలకు తావిస్తోంది.ఘటనకు సంబంధించి ఫిర్యాదు అందిన తర్వాత విచారణ ఏ దశలో ఉందనే విషయాన్ని పోలీసులు వెల్లడించలేదు. ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు సిబ్బందిని విచారించారా? శాఖాపరమైన చర్యలకు సిఫారసు చేశారా? లేక కేసు విచారణ ఇంకా కొనసాగుతోందా? అనే అంశాలపై అధికారిక సమాచారం బయటకు రాలేదు.ఇదిలా ఉండగా, ఈ వ్యవహారాన్ని పై అధికారుల దృష్టికి వెళ్లకుండా రాజీ చేసేందుకు ప్రయత్నాలు జరిగాయన్న ప్రచారం స్థానికంగా చర్చకు దారితీసింది. ఫిర్యాదు నమోదైన కేసులో పారదర్శకంగా విచారణ జరిపి, వాస్తవాలను వెలికితీసి, తప్పు నిర్ధారణ అయితే సంబంధిత పోలీసు సిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



## మినరల్ వాటర్ ప్లాంట్ల దందా


**.. నిబంధనలకు తూట్లు**

**ప్రజా వాయిస్,సంగారెడ్డి :** సంగారెడ్డిజిల్లాతో పాటు తెలంగాణ వ్యాప్తంగా మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ప్యూరిఫైడ్ వాటర్ పేరుతో సాధారణ నీటినే విక్రయిస్తూ కొందరు నిర్వాహకులు ప్రజలను మోసం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అపరిశుభ్రమైన క్యాన్లలో నీటిని నింపి సరఫరా చేయడంతో పాటు ప్లాంట్లలో పరిశుభ్రతా ప్రమాణాలు పాటించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. రోజూ వేల సంఖ్యలో నీటి క్యాన్లు విక్రయిస్తూ లక్షల రూపాయల వ్యాపారం చేస్తున్నా, ప్రభుత్వ నిబంధనలను చాలామంది నిర్వాహకులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం...సంగారెడ్డి జిల్లాలోని జోగిపేట,సదాశివాపేట,జహిరాభాద్, సంగారెడ్డి మున్సిపాలిటీలతో పాటు జిల్లాలోని మండలాలు, గ్రామాల్లో మరియు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అనేక మినరల్ వాటర్ ప్లాంట్లు కొనసాగుతున్నాయి. కొన్నింటికి అధికారిక అనుమతులు ఉన్నప్పటికీ, మరికొన్ని ఎలాంటి అనుమతులు లేకుండానే కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. నీటిలో రుచి కోసం రసాయనాలు కలిపి విక్రయిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (BIS) నిబంధనల ప్రకారం మినరల్ వాటర్ ప్లాంట్లు ఐఎస్ఐ ధ్రువీకరణ, కాలుష్య నియంత్రణ అనుమతులతో పాటు పలు ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలి. అర్హత కలిగిన ల్యాబ్ టెక్నీషియన్‌ను నియమించి ప్రతిరోజూ నీటి నాణ్యతను పరీక్షించాలి. అలాగే ప్రతి క్యాన్‌పై నీటిని నింపిన తేదీ, ఇతర వివరాలతో స్టిక్కర్ ఉండాలి. అయితే జిల్లాలోని పలుచోట్ల ఈ నిబంధనలను పూర్తిగా విస్మరిస్తూ అపరిశుభ్రమైన నీటినే సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికారుల తనిఖీలు కరువు అనుమతులు లేకుండా కొనసాగుతున్న మినరల్ వాటర్ ప్లాంట్లపై సంబంధిత శాఖలు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ, అలాంటి చర్యలు కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్, ఆహార భద్రత అధికారులు, గ్రామీణ ప్రాంతాల్లో పీహెచ్‌సీ వైద్యులు, ఆహార భద్రత అధికారులు, ఎంపీడీవో, తహసీల్దార్‌లు తనిఖీలు నిర్వహించే అవకాశం ఉన్నప్పటికీ పర్యవేక్షణ లోపిస్తోందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని మరియు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మినరల్ వాటర్ ప్లాంట్లపై ప్రత్యేక తనిఖీలు చేపట్టి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## డీడీ కట్టాం... ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కడ..?

- రెండేళ్లైనా ఏర్పాటు కాని ట్రాన్స్‌ఫార్మర్
- విద్యుత్ శాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న బాధితులు
- వస్తుంది... చూస్తాం... అంటూ కాలయాపన చేస్తున్న అధికారులపై ఆగ్రహం
- వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని బాధితుల డిమాండ్

**ప్రజా వాయిస్, నిడమానూర్:** ప్రభుత్వానికి చెల్లించాల్సిన డబ్బులు సకాలంలో చెల్లించినా, ప్రజలకు అందాల్సిన సేవలు మాత్రం అందడం లేదని నల్గొండ జిల్లా నిడమానూర్ మండలం తుమ్మడం గ్రామానికి చెందిన బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2024లో విద్యుత్ శాఖ నిబంధనల ప్రకారం డిమాండ్ డ్రాఫ్ట్ (డీడీ) చెల్లించినప్పటికీ, రెండేళ్లు గడిచినా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.గ్రామానికి చెందిన గంగుల ఆంజనేయులు, గంగుల పద్మ, రావుల సైదయ్య, రావుల మల్లయ్య, పాల్వాయి ఎంకమ్మ పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులను కలిసి సమస్యను వివరించినా, ప్రతిసారీ వస్తుంది. చూస్తాం అనే సమాధానమే వినిపిస్తోందని ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఎప్పుడు ఏర్పాటు చేస్తారనే విషయంపై స్పష్టమైన హామీ ఇవ్వకుండా నెలలు, సంవత్సరాలు గడిపేస్తున్నారని మండిపడుతున్నారు.ట్రాన్స్‌ఫార్మర్ లేక విద్యుత్ సరఫరా సమస్యలు తీవ్రంగా మారి రోజువారీ జీవనంతో పాటు వ్యవసాయ పనులు కూడా ఇబ్బందులకు గురవుతున్నాయని బాధితులు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన మొత్తాన్ని చెల్లించిన తర్వాత కూడా కనీస సౌకర్యం అందకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు.రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యపై జిల్లా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని, ఇకపై మాటలు కాకుండా చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల నుంచి డబ్బులు తీసుకున్న శాఖ, సేవల విషయంలో కూడా అదే బాధ్యతతో వ్యవహరించాలని వారు కోరుతున్నారు.



# లెక్కల మాస్టర్ గా మారిన కలెక్టర్

- టీఎస్ డబ్ల్యూ ఆర్ ఎస్ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ
- అధిక సంఖ్యలో పిర్యాదులు అందడమే ఇందుకు కారణం!
- ఫిర్యాదులకు కారణమైన అంశాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- అధికారులకు కలెక్టర్ దీపక్ తివారి ఆదేశాలు



**ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:** వికారాబాద్ జిల్లా కొత్త గడి టీఎస్ డబ్ల్యూఆర్ఎస్ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి గురువారం జిల్లా కలెక్టర్ కొత్తగడి బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.జిల్లాలోని గురుకుల పాఠశాల, కళాశాలపై అధిక సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో నేరుగా మాట్లాడిన కలెక్టర్, పలువురు విద్యార్థులు టీసీ లు ఎందుకు తీసుకున్నారని ప్రశ్నిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు మధ్యలోనే చదువు మానేయడం లేదా ఇతర విద్యాసంస్థలకు వెళ్లే పరిస్థితులు ఎందుకు ఏర్పడ్డాయో సమగ్రంగా సమాచారం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

**రిజిస్టర్ల పరిశీలన**

విద్యార్థుల ప్రవేశాలు, హాజరు, డ్రాపౌట్‌లు, టీసీల జారీకి సంబంధించిన రిజిస్టర్ లను పరిశీలించారు . విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్య, వసతి, భోజనం తదితర అంశాల్లో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు.గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడం అధికారుల బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ఫిర్యాదులకు కారణమైన అంశాలపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న విద్య, వసతి, ఆహార నాణ్యత, పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యాలు, హాస్టల్, వంటశాల, తరగతి గదులను పరిశీలించారు.ఈ సందర్భంగా విద్యార్థినులతో మమేకమై వారి విద్యాభ్యాసం, ఆరోగ్యం, వసతి, మెనూ ప్రకారం భోజనం ఉండాలని,భోజన నాణ్యతపై ఆరా తీశారు. కిచెన్, స్టోర్ రూమ్, టాయిలెట్స్, పరిశీలించారు.ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు ప్రతి విద్యార్థినికి అందేలా అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

**లెక్కలు బోధించిన కలెక్టర్**

విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు లెక్చరర్ గా మారి లెక్కలు బోధించి వారితో సమాధానాలు చెప్పించారు.పాఠశాలలో ఎలాంటి లోపాలు ఉన్నా వెంటనే పరిష్కరించి, విద్యార్థినులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ తనిఖీలో ట్రైని కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టుర్, కళాశాల ప్రిన్సిపాల్ సాయి లత, ఎస్సి వెల్ఫేర్ అధికారి జయపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



## సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలి

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్

**ప్రజా వాయిస్ వేములపల్లి** అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండల సమగ్రభివృద్ధికి పాటు పడాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ లు అన్నారు. గురువారం నల్గొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన మండల సమీక్ష సామర్థ్య వృద్ధి సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే అభివృద్ధి సంక్షేమ నిధులను గ్రామాల్లోనీ, సమస్యల ప్రాధాన్యత క్రమంలో ఖర్చు చేస్తూ గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రస్తుతం వానాకాలం సీజన్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుద్ధ చర్యలతో పాటు నీరు కలుషితం కాకుండా స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో రూ 30, లక్షలతో నూతనంగా ఫుడ్ గ్రైన్స్ స్టోరేజ్ గోదాం నిర్మాణ పనుల కు ఆయన భూమి పూజ చేశారు, ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్ రావు, ఎంపీడీవో జితేందర్ రెడ్డి, డిటి కోటేశ్వరి, సర్పంచ్ లు పుట్టల సందీప్ కుమార్, పిల్లల సందీప్, బుర్రి లక్షి , జెర్రిపోతుల మౌనిక, మమత, దేశి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పెద్దపంగ సైదులు, నారాబోయిన సతీష్, చంద్రయ్య, ఉపేంద్రమ్మ, ఆయా శాఖ అధికారులు కార్యదర్శులు పాల్గొన్నారు

## అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

- హుస్నాబాద్‌లో దాబాలపై ఎక్సైజ్ దాడులు

**ప్రజా వాయిస్ హుస్నాబాద్**, హుస్నాబాద్ పట్టణంలో ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీలు స్థానికంగా కలకలం రేపాయి. నిబంధనలను ఉల్లంఘిస్తూ అనుమతులు లేకుండా దాబాలు మరియు రెస్టారెంట్లలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న, అలాగే మద్యం సేవించేందుకు ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులపై అధికారులు కఠిన చర్యలకు ఉపక్రమించారు.హుస్నాబాద్ ఎక్సైజ్ సిఐ పవన్ ఆదేశాల మేరకు అధికారులు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా ఎలాంటి లైసెన్సులు లేకుండా రాజేష్ దాబా మరియు మారుతీ దాబాలో అక్రమంగా మద్యం సేవించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తేలడంతో నిర్వాహకులపై వెంటనే కేసులు నమోదు చేశారు. భవిష్యత్తులో పట్టణంలోని ఏ దాబాలోనూ మద్యం అమ్మకాలు జరగకూడదని, ఎవరూ లోపల మద్యం సేవించడానికి అనుమతించకూడదని హెచ్చరిస్తూ నిర్వాహకులకు అధికారికంగా నోటీసులు జారీ చేశారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.ఈ మెరుపు దాడుల కార్యక్రమంలో హుస్నాబాద్ ఎక్సైజ్ ఎస్సై దామోదర్, హెడ్ కానిస్టేబుల్ శ్రీకాంత్ రెడ్డి, కానిస్టేబుళ్లు భాస్కర్, రేణుక పాల్గొన్నారు.




## వైద్య విద్యలో తెలంగాణ విద్యార్థులకు న్యాయం చేయండి

**చక్రాల కేదార్ నాథ్,ఉపాధ్యాయులు (వికారాబాద్ జిల్లా)**

**ప్రజావాయిస్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీలు మరియు తెలంగాణ సమాజానికి ఒక విజ్ఞప్తి ఏమనగా.. రాష్ట్రంలో వైద్య విద్య (ఎంబీబీఎస్, బీడీఎస్, పీజీ మెడికల్)లో తెలంగాణ విద్యార్థులకు కేటాయించిన స్థానిక (85శాతం) కోటా ఉద్దేశించిన విధంగా తెలంగాణ బిడ్డలకు పూర్తిగా ఉపయోగపడడం లేదనే ఆందోళన తల్లిదండ్రులు, విద్యార్థుల్లో పెరుగుతోంది.ప్రస్తుతం కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు ఇతర రాష్ట్రాల విద్యార్థులను తెలంగాణలోని తమ విద్యాసంస్థల్లో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదివించి, ప్రస్తుత స్థానిక అర్హత నిబంధనల ప్రకారం వారిని తెలంగాణ స్థానిక అభ్యర్థులుగా అర్హులుగా చేసే పరిస్థితి ఉందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తెలంగాణ విద్యార్థులకు లభించాల్సిన అవకాశాలు తగ్గుతున్నాయని భావిస్తున్నారు.ఈ నేపథ్యంలో తెలంగాణ విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం స్థానిక అర్హత నిబంధనలను సమీక్షించాలని వినమ్రంగా కోరుతున్నాము.

**మా ప్రధాన డిమాండ్:**

తెలంగాణలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు కనీసం 7 సంవత్సరాలు చదివిన విద్యార్థులను మాత్రమే తెలంగాణ స్థానిక విద్యార్థులుగా గుర్తించేలా చట్టపరమైన మార్పులు తీసుకురావాలి. ఈ విధానం వైద్య విద్యతో పాటు ఇతర ఉన్నత విద్యా ప్రవేశాలు మరియు ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా అమలు చేయాలని కోరుతున్నాము.

**ఇలాంటి చర్యల వల్ల:**

తెలంగాణ విద్యార్థులకు వారి స్థానిక అవకాశాలు మరింత రక్షించబడతాయి.స్థానిక కోటా ఉద్దేశ్యం సార్థకమవుతుంది.దుర్వినియోగానికి అవకాశం తగ్గుతుంది.తెలంగాణ రాష్ట్ర సాధన లక్ష్యాలకు అనుగుణంగా స్థానిక యువతకు న్యాయం జరుగుతుంది.తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన ఉద్యమం యొక్క ప్రధాన లక్ష్యాల్లో ఒకటి తెలంగాణ యువతకు విద్యా, ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యత కల్పించడం. ఆ ఆశయాలను పరిరక్షించే దిశగా ప్రభుత్వం అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తగిన నిర్ణయాలు తీసుకోవాలని తెలంగాణ ప్రజల తరపున మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేస్తున్నాము.





## 'నన్ను నాన్-లోకల్ అనడం రాజకీయ దివాళాకోరుతనం'

- డీసీసీ అధ్యక్షురాలు సుగుణ

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్** ఆసిఫాబాద్ జిల్లాలో కొందరు నాయకులు వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీలో వర్గ రాజకీయాలను ప్రోత్సహిస్తూ పార్టీని బలహీనపరిచే ప్రయత్నం చేస్తున్నారని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ ఆరోపించారు. డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.తాను కొమురం భీం జిల్లాలో పుట్టి పెరిగిన ఆదివాసి బిడ్డనని, తనను నాన్–లోకల్‌గా చిత్రీకరించడం రాజకీయ దివాళాకోరుతనమని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ తన సేవలను గుర్తించి బాధ్యతలు అప్పగించిందని, వాటిని ప్రశ్నించడం అధిష్ఠానం నిర్ణయాన్నే సవాల్ చేయడమేనన్నారు.పార్టీలో క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై అధిష్ఠానం తగిన చర్యలు తీసుకుంటుందని పేర్కొంటూ, కార్యకర్తలు అపోహలకు లోనుకాకుండా ఐక్యంగా ఉండి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.



## గుడుంబా స్థావరాలుపై కార్డెన్ అండ్ చర్చ ఆపరేషన్

- ప్రజలు చట్ట వ్యతిరేకమైన పనులు మానుకోవాలి
- సి ఐ వినయ్ కుమార్

**ప్రజా వాయిస్/ కొత్త గూడ** కొత్తగూడ మండలం రేణ్య తండాలోజిల్లా ఎస్పీ శ్రీ శబరీష్ సూచనల మేరకు,, డి.ఎస్.పి తిరుపతి రావు ఆదేశాల ప్రకారం రేణ్య తండా గ్రామంలో కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించడం అయినది.. దీనిలో భాగంగా 38 లీటర్ల గుడుంబా, 120 కేజీల బెల్లం, ఎనిమిది వందల లీటర్ల గుడుంబా పానకం, స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేయడం జరిగింది,.. ఈ ఆపరేషన్ గూడూరు సిఐ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో కొత్తగూడ గంగారం ఎస్సెలు రాజ్ కుమార్, కోటేశ్వరరావు తో పాటు స్పెషల్ పార్టీ, సివిల్,టీజీ ఎస్ పి సిబ్బంది మొత్తం కలిపి 40 మంది పాల్గొన్నారు..



## ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తితోనే తెలంగాణ రాష్ట్ర సాధన

- నియోజకవర్గవ్యాప్తంగా ఘనంగా జయంతి వేడుకలు
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కోదాడలో నివాళులు
- మూడు తరాల ఉద్యమానికి జయశంకర్ మార్గదర్శి

**ప్రజా వాయిస్, కోదాడ:** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలు గురువారం నియోజకవర్గవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో జయశంకర్ సార్ చేసిన విశిష్ట సేవలను వక్తలు స్మరించుకున్నారు.బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కోదాడలో నిర్వహించిన కార్యక్రమంలో జయశంకర్ సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు నయీమ్ మాట్లాడుతూ, జయశంకర్ సార్ చూపిన సిద్ధాంతాలు, స్ఫూర్తితోనే ఉద్యమనేత కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రం సాకారమైందన్నారు. మూడు తరాల తెలంగాణ ఉద్యమంలో జయశంకర్ సార్ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.సార్ సిద్ధాంతాలకు కట్టుబడి కేసీఆర్ శాంతియుత ఉద్యమంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దారని అన్నారు. జయశంకర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కే. బాబు, కరీముల్లా, బాబా, భాగ్యమ్మ, అబ్బు, ఉపేందర్ గౌడ్, వేణుగోపాల్, మల్లయ్య, మజార్, వీరాచారి, పాషా, నిస్సార్, జానీ, గోపి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## చెల్లాపూర్ రోడ్డు దుస్థితిపై రైతుల వినూత్న నిరసన

### .. రోడ్డుపైనే వరి నాట్లు!

**ప్రజా వాయిస్ దుబ్బాక**, దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చెల్లాపూర్ వార్డులో రహదారి పూర్తిగా అధ్వానంగా తయారవడంతో స్థానిక రైతులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. చెల్లాపూర్ వార్డులోని స్మశాన వాటికకు వెళ్లే ప్రధాన రహదారి చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారి గుంతలమయంగా తయారైంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే రైతులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం పొలాలకు వెళ్లే సమయంలో పడుతున్న అవస్థలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సత్తు తిరుమల్ రెడ్డి ఆధ్వర్యంలో రైతులు ఏకంగా రోడ్డుపైనే వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సత్తు తిరుమల్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు దెబ్బతినడంతో రైతులు పడుతున్న కష్టాలను వివరించారు. ప్రజల మరియు రైతుల ఇబ్బందులను గుర్తించి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. తక్షణమే స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని, రైతుల రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందిని పూర్తిగా తొలగించాలని ఆయనతో పాటు పాల్గొన్న రైతులంతా ముక్తకంఠంతో కోరారు.



## గుంతల సమస్యపై స్పందించిన కాటారం ఎస్ఐ

- వెంటనే రహదారి మరమ్మతులు

**ప్రజా వాయిస్ మహాదేవపూర్ ప్రతినిధి** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం కొత్తపల్లి జాతీయ రహదారి ఎన్‌హెచ్–353(సి) పై టోల్‌గేట్ సమీపంలో ఏర్పడిన గుంతలు, రహదారి దెబ్బతినడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు సమస్యను గుర్తించినప్పటికీ టోల్‌గేట్ అధికారులు తగిన చర్యలు చేపట్టకపోవడంతో అప్పాల భూమేష్ ఈ విషయాన్ని కాటారం పోలీస్ స్టేషన్ ఎస్ఐ దృష్టికి తీసుకెళ్లారు.విషయాన్ని వెంటనే పరిగణనలోకి తీసుకున్న ఎస్ఐ టోల్‌గేట్ అధికారులతో మాట్లాడి, ప్రమాదకరంగా మారిన రహదారి భాగంలో తక్షణమే మరమ్మతు పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. దీంతో రహదారిపై ప్రయాణించే వాహనదారులకు కొంత మేర ఉపశమనం లభించడంతో పాటు ప్రమాదాల ముప్పు కూడా తగ్గింది.సమస్యపై వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకున్న కాటారం ఎస్ఐకి మేడిపల్లి గ్రామ ప్రజలు, వాహనదారులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.





# ఆ బాధ్యత గ్రామ సర్పంచులదే

- సంక్షేమ పథకాలన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్

**ప్రజావాయిస్/వికారాబాద్:** జిల్లా అభివృద్ధి జరగాలంటే ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలాన్నింటిని ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత సర్పంచ్ లదేనని తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. గురువారము వికారాబాద్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ సమావేశము హాలు నందు జరిగిన మండల స్థాయి సమీక్ష సమావేశానికి ముఖ్య అతిధిగా హాజరైయ్యారు.ఈసందర్భంగా మాట్లాడుతూ మండల స్థాయి సమావేశాలకు అన్ని శాఖల అధికారులు సరైన, పూర్తి స్థాయి సమాచారం అందించాలని, శాఖల వారిగా సమస్యలు, అవసరమైన పనుల వివరాలను అందిస్తే సాధ్యమైనంత తొందరగా పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వ అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి , ప్రజలు ఫోన్ చేస్తే తప్పని సరిగా స్పందించాలని , ప్రజల సమస్యల పరిష్కారంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఎల్లప్పుడూ బాధ్యతగా వ్యవహరించి వాటిని పరిష్కరించాలన్నారు. వికారాబాద్ ప్రాంతానికి సాగు, తాగు నీరు ఇచ్చే బాధ్యత నాదేనని ఈ సందర్భంగా అన్నారు. సి ఎం నియోజకవర్గం నుండి నీళ్లు వచ్చే విధంగా చేస్తే రైతులు సుబిక్షంగా ఉంటారన్నారు.జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వ పథకాలపై సర్పంచులు, వార్డు మెంబర్ లు పూర్తి అవగాహనా కలిగి ఉండాలన్నారు.సమావేశములో మార్కెట్ కమిటి చైర్మెన్ శ్రీనివాస్ రావు,, జాడ్ పి సి ఇ ఓ సుధీర్, ఎం పి డి ఓ వినయ్ కుమార్,,సర్పంచులు, పంచాయతి సెక్రటరీ లు గ్రామ, మండల ప్రజాప్రతినిధులు, అధికారులు.తదితరులు పాల్గొన్నారు.

# చివరి శ్వాసలోనూ నలుగురికి జీవం పోసిన ఆర్ఎంపీ డాక్టర్ రవీందర్

- బ్రెయిన్ డెడ్ తర్వాత కుటుంబ సభ్యుల గొప్ప నిర్ణయం
- గుండె, కాలేయం, రెండు కిడ్నీలు, నేత్రాల దానం
- అశ్రునయనాల మధ్య అంతిమయాత్ర... "డాక్టర్ ఎక్కడ?" అంటూ విలపించిన ప్రజలు





**ప్రజా వాయిస్, పెద్ద శంకరంపేట:** బతికున్నంతకాలం ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు అంకితభావంతో సేవలందించిన ఓ గ్రామీణ వైద్యుడు... మరణానంతరం కూడా తన అవయవాలను దానం చేసి నలుగురి జీవితాల్లో వెలుగులు నింపాడు. పెద్ద శంకరంపేటకు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు తోట రవీందర్ ( రవి ) జీవితం సేవకు ప్రతీకగా నిలిస్తే, ఆయన మరణం మానవత్వానికి చిరస్మరణీయ సందేశంగా నిలిచింది.ఈ నెల 2వ తేదీన పెద్ద శంకరంపేట పట్టణ శివారులోని గురుపాదుగుట్ట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రవీందర్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ, వైద్యుల ప్రయత్నాలు ఫలించలేదు. గురువారం ఆయనను బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు.ఈ విషాద సమయంలోనూ కుటుంబ సభ్యులు అసాధారణ ధైర్యం ప్రదర్శించారు. జీవన్దాన్ అవయవదాన బృందం వైద్యులు అవయవదానం ద్వారా పలువురికి ప్రాణం పోయవచ్చని వివరించడంతో, కుమారుడు శారీరకంగా లేకపోయినా ఆయన సేవాభావం శాశ్వతంగా కొనసాగాలని భావించిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వెంటనే అవయవదానానికి అంగీకరించారు. అనంతరం వైద్యులు రవీందర్ గుండె, కాలేయం, రెండు కిడ్నీలు, నేత్రాలను సేకరించి అవసరమైన రోగులకు అందించే ఏర్పాట్లు చేశారు. దీంతో పలువురికి కొత్త జీవితం లభించింది.పెద్ద శంకరంపేటకు చెందిన రవీందర్, మల్కాపూర్‌తో పాటు పరిసర గ్రామాల్లో ఆర్ఎంపీ వైద్యుడిగా సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందారు. పేద, ధనిక అనే తేడా లేకుండా అందరికీ అందుబాటులో ఉండే వైద్యుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. అర్ధరాత్రి అయినా, అత్యవసర సమయమైనా ఒక్క ఫోన్ చేస్తే ఇంటి వద్దకే చేరుకుని వైద్యం అందించే సేవాభావమే ఆయనను ప్రజలకు మరింత దగ్గర చేసింది.రవీందర్ మరణవార్త తెలిసిన వెంటనే పెద్ద శంకరంపేట, మల్కాపూర్ గ్రామాలు శోకసంద్రంగా మారాయి. ఆయన భౌతికకాయం స్వగ్రామానికి చేరుకోగానే వేలాది మంది ప్రజలు, యువకులు, మహిళలు, బంధువులు తరలివచ్చి అశ్రునయనాలతో తుది వీడ్కోలు పలికారు. "డాక్టర్ ఎక్కడ... డాక్టర్ ఎక్కడ...?" అంటూ వృద్ధులు విలపించిన దృశ్యాలు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించాయి.నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం కన్నీరుమున్నీరుగా సాగిన అంతిమయాత్ర మధ్య రవీందర్ అంత్యక్రియలు నిర్వహించారు.

## బతికున్నంతకాలం రోగుల ప్రాణాలను కాపాడిన డాక్టర్...

మరణానంతరం తన అవయవాలతో మరో నలుగురిలో జీవిస్తూ నిజమైన మానవతా మూర్తిగా నిలిచిపోయారని గ్రామస్థులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు భావోద్వేగంతో నివాళులర్పించారు. ఆయన సేవా జీవితం, అవయవదానం సమాజానికి శాశ్వత స్ఫూర్తిగా నిలుస్తుందని కొనియాడారు.




# అంకుసాపూర్‌లో అటవీ, పట్టా భూముల వివాదంపై సంయుక్త చర్చలు

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా అంకుసాపూర్ గ్రామ పరిధిలోని అటవీ భూములు, పట్టా భూముల వివాదంపై రెవెన్యూ, అటవీ శాఖల అధికారులు స్థానిక పట్టేదారులతో శాంతియుతంగా చర్చలు నిర్వహించారు.సర్వే నంబర్ 145లో అటవీ శాఖకు కేటాయించిన 684 ఎకరాల భూములు పోను, మిగిలిన భూములు పట్టేదారులకే చెందుతాయని ఆర్డీవో స్పష్టం చేయడంతో స్థానిక రైతులు అంగీకారం తెలిపారు. చర్చల అనంతరం భవిష్యత్తులో నిర్ణీత తేదీన పూర్తిస్థాయి జాయింట్ డిమార్కేషన్ చేపట్టి సరిహద్దులను ప్రకటించాలని నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ తరఫున ఆర్డీవో, తహసీల్దార్, సర్వేయర్లు, అటవీ శాఖ తరఫున ఎఫ్‌డీవో, ఎఫ్ఆర్వో, సిబ్బంది, అంకుసాపూర్ గ్రామ భూమి పట్టేదారులు, రైతులు పాల్గొన్నారు.

# 15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి: బీజేపీ



**ప్రజా వాయిస్ మహాదేవపూర్ ప్రతినిధి** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, చల్ల నారాయణరెడ్డి డిమాండ్ చేశారు.బీజేపీ చేపట్టిన "ఫీజుల బకాయి బీజేపీ లడాయి" కార్యక్రమంలో భాగంగా మహాదేవపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన వారు విద్యార్థులతో మాట్లాడి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బీజేపీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.అనంతరం వారు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల విషయంలో తన బాధ్యతను విస్మరించడంతో సుమారు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. "వన్ టైమ్ సెటిల్‌మెంట్" పేరుతో ఇచ్చిన హామీలు అమలు కాలేదని విమర్శించారు. బకాయిలు చెల్లించకపోవడంతో పేద కుటుంబాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఫీజులు చెల్లించలేక సర్టిఫికెట్లు పొందడంలో జాప్యం ఏర్పడి ఉద్యోగాలు, ఉన్నత విద్య అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో స్కాలర్‌షిప్‌లు అందక విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా బీజేపీ ప్రభుత్వం ముందు ఐదు ప్రధాన డిమాండ్లు ఉంచింది. రూ. 15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఫీజు బకాయిల కారణంగా నిలిచిపోయిన సర్టిఫికెట్లను వెంటనే అందజేయాలని, 40 లక్షల మంది విద్యార్థుల చదువులు, ఉద్యోగ అవకాశాలు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో బకాయిలు పేరుకుపోకుండా ఫీజు రీయింబ ర్స్‌మెంట్ పథకాన్ని ప్రత్యేక చట్టం ద్వారా సమర్థంగా అమలు చేయాలని, ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు అత్యవసర ఆర్థిక ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మంథని నియోజకవర్గ సీనియర్ నాయకుడు సత్యప్రకాష్, మండల అధ్యక్షుడు రాంశెట్టి మనోజ్, మాజీ అధ్యక్షుడు సిరిపురం శ్రీమన్నారాయణ, ఓబీసీ మండల అధ్యక్షుడు సాగర్ల రవీందర్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఓడేటి బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు బల్ల శ్రావణ్ కుమార్, లింగంపల్లి వంశీధర్ రావు, కోశాధికారి పూర్ణచందర్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు లింగంపల్లి జోగేష్, మండల నాయకులు ఐలయ్య, వెంకటేష్, సాయి, రాకేష్, పోషన్నతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# యూనియన్ బ్యాంక్ ద్వారా రూ.1.05 కోట్ల బీమా చెక్కు అందజేత

- ఉద్యోగుల సంక్షేమానికి టీజీఎన్ పీడీసీఎల్ కట్టుబడి ఉంది
- సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి** టిజిఎన్పీడీసీఎల్ ఉద్యోగుల సంక్షేమానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. హన్మకొండ, నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో గురువారం హనుమకొండ టౌన్ డివిజన్ పరిధిలోని కాజీపేట సెక్షన్‌లో లైన్‌మన్‌గా విధులు నిర్వహించిన ఉకంటి ప్రకాష్ భార్య ఉకంటి సంధ్యకు సీఎండీ రూ.1.05 కోట్ల బీమా చెక్ ను అందజేశారు. ఈ సందర్భంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది ఆగస్టులో విధులు పూర్తి చేసుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉకంటి ప్రకాష్ మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి యూనియన్ బ్యాంక్ సాలరీ ప్యాకేజీ గ్రూప్ ఇన్సూరెన్స్ ద్వారా అందుతున్న రూ.1.05 కోట్ల బీమా మొత్తం ఆ కుటుంబానికి ఆర్థిక భరోసాగా నిలుస్తుందని తెలిపారు. ఈ ఆర్థిక సహాయం ద్వారా కుటుంబ సభ్యులు, ముఖ్యంగా పిల్లల విద్యాభ్యాసం, భవిష్యత్ అవసరాలకు కొంతమేర అండగా నిలుస్తుందని ఆకాంక్షించారు. ఉకంటి ప్రకాష్ కుమారుడు ఉకంటి ప్రణవ్ కు కారుణ్య నియామకం కింద టీజీఎన్‌పీడీసీఎల్‌లో ఉద్యోగం కల్పించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ అధికారి కమలాకర్ గంటి, నక్కలగుట్ట బ్రాంచ్ మేనేజర్ బసవరాజు వి.కె, ఇతర ఉన్నతాధికారులు, టీజీఎన్‌పీడీసీఎల్ అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజావాయిస్ కథనం నిజమైంది

- బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రమేష్ కుమార్
- పత్రిక విశ్లేషణకు రాజకీయ వర్గాల నుండి ప్రశంసలు



జిల్లా అధ్యక్షుడిగా రమేష్ కుమార్

**ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:** గత కొద్ది రోజులుగా ఖాళీగా ఉన్న బీజేపీ జిల్లా అధ్యక్ష పదవిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతున్న వేళ, ఈ పదవి తాండూరు నియోజక వర్గానికి చెందిన ఉప్పరి రమేష్ కుమార్ ముందు వరసలో ఉన్నట్లు ప్రజావాయిస్ పత్రిక ప్రచురించిన కథనం నిజమైంది.పార్టీ వర్గాల అంచనాలకు అనుగుణంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఉప్పరి రమేష్ కుమార్ ఎంపిక కావడంతో ప్రజావాయిస్ వెల్లడించిన సమాచారం వాస్తవమని తేలింది. పార్టీ బలోపేతం, సంస్థాగత నిర్మాణంలో ఆయన పాత్ర, నాయకత్వ లక్షణాలను పరిగణనలోకి తీసుకుని అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించనున్న రమేష్ కుమార్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. రానున్న రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆయన కృషి చేస్తారనే ఆశాభావాన్ని నాయకులు వ్యక్తం చేస్తున్నారు.కాగా, జిల్లా అధ్యక్ష పదవిపై ఉప్పరి రమేష్ కుమార్‌కే అవకాశం దక్కుతుందని ప్రజావాయిస్ పత్రిక ముందుగానే ప్రచురించిన కథనం నిజం కావడంతో పత్రిక విశ్లేషణకు రాజకీయ వర్గాల్లో ప్రశంసలు లభిస్తున్నాయి.

# తెలంగాణ జాతి ఆత్మగౌరవానికి జయశంకర్ చిరస్మరణీయం

- అనంతగిరి మండల వ్యాప్తంగా ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు
- ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ పంచాయతీల్లో చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు
- తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసిన అధికారులు, ఉద్యోగులు




ప్రజా వాయిస్,అనంతగిరి: తెలంగాణ రాష్ట్ర సాధనకు సిద్ధాంతకర్తగా, ఉద్యమానికి మార్గదర్శిగా నిలిచిన ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని గురువారం అనంతగిరి మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీఓ కార్యాలయంతో పాటు అన్ని గ్రామ పంచాయతీల్లో అధికారులు, ఉద్యోగులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ తెలంగాణ కోసం ప్రొఫెసర్ జయశంకర్ చేసిన త్యాగాలు, ఆయన చూపిన ఉద్యమ స్ఫూర్తి తరతరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, భాష, ఆత్మగౌరవ పరిరక్షణకు ఆయన నిర్దేశించిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, ముఖ్యంగా యువత ఆయన ఆశయాలను ఆచరణలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు.కార్యక్రమాల్లో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ సేవలను స్మరించుకున్నారు.

# మండల కేంద్రంలోపట్టపగలు వెలుగుతున్నవీధిదీపాలు

**ప్రజా వాయిస్ గంభీరావుపేట**/ సిరిసిల్ల రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో ఎంపీడీవో ఆఫీస్ పైన మిట్ట మధ్యాహ్నం వెలుగుతున్న వీధి దీపాలు పట్టించుకోని అధికారులు అలాగే మండల ప్రాంగణంలో ఊర పందుల సంచారం పట్టించుకోని వైనం వర్షాకాలంలో సీజన్ వైరల్ కు కారణం పందులు వాటిని అరికట్టలేని అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి పై అధికారులు చొరవ చూపి వెంటనే పందుల ను గ్రామ పొలిమేర అవతలో ఉంచాలి దానిపై వెంటనే చర్యలు తీసుకోవాలని గంబిరావుపేట మండల ప్రజలు కోరుతున్నారు.





## బోనం ఎత్తిన బడి పిల్లలు పోతరాజుగా అలరించిన విద్యార్థులు

### యెల్గొండగూడ బడిలో ఘనంగా తెలంగాణ బోనాల సంబరాలు

**(ప్రజా వాయిస్ షాబాద్)**తెలంగాణ రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలు మరియు ఆత్మగౌరవానికి ప్రతీక అయిన బోనాల పండుగ సంబరాలను షాబాద్ మండలం ఎంపీపీఎస్ యెల్గొండగూడ పాఠశాలలో గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం భక్తిపారవశ్యం ఆధ్యాత్మిక శోభతో విలసిల్లిందిపాఠశాలలో అమ్మవారి చిత్రపటానికి ఉపాధ్యాయులు గ్రామ పెద్దలు ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థినులు సాంప్రదాయ పట్టు వస్త్రాలు ధరించి తలపై భక్తిశ్రద్ధలతో బోనాలను ఎత్తుకుని ఊరేగింపుగా రాగా విద్యార్థులు పోతరాజుల వేషధారణతో జానపద పాటలకు చేసిన నృత్యాలు, ప్రదర్శించిన కళారూపాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి మన విద్యావ్యవస్థలో విద్యతో పాటు తెలంగాణ అద్భుతమైన సంస్కృతి సంప్రదాయాలు పండుగల విశిష్టతను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతోనే ఈ బోనాల ఉత్సవాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు ఈ పండుగ వేడుకల్లో విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ పెద్దలు నగర ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని పిల్లల ప్రదర్శనలను తిలకించి మురిసిపోయారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు మరియు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆ గిరిజన గ్రామాలకు మోక్షం ఎప్పుడో

- ఇచ్చిన హామీలు నీళ్లమూట
- నాయకులు రారు, అధికారులు పట్టించుకోరు
- ఓట్లకే పరిమితమాచదివిద్దాం అంటే బడి లేదు
- బడికి పంపుదాం అంటే దారి లేదు
- అభివృద్ధి అందరికీ సమానంగా చేరాలనే ప్రభుత్వాల మాటలు గాలిలో కలిశాయి



**ప్రజా వాయిస్ నేన్నెల్** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి నియోజకవర్గం లోని నెన్నెల మండలం పాటి, భోగంపల్లి గిరిజన గ్రామాల పరిస్థితి మాత్రం ఇప్పటికీ దశాబ్దాల వెనుకబాటుతనాన్ని తలపిస్తోంది. రాష్ట్రంలో అనేక గిరిజన గ్రామాలు కనీస వసతులకు నోచుకోలేదు. రహదారులు, తాగునీరు,విద్య మరియు వైద్యం, లేని సదుపాయాల కొరత తీవ్రంగా ఉంది. గ్రామస్తుల వేదన ఈ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం తక్షణమే స్పందించాలి.స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా ఈ గ్రామాలకు కనీస రహదారి సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రెండు గ్రామాల్లో కలిపి సుమారు 50 కుటుంబాలు, 150 మందికి పైగా కొలాం గిరిజనులు నివసిస్తున్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు గ్రామానికి వెళ్లే దారులు బురదమయమై రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. మెయిన్ రోడ్డుకు చేరుకోవాలంటే సుమారు రెండు కిలోమీటర్లు కాలినడకనే ప్రయాణించాల్సి వస్తోంది. గ్రామంలో ఎవరైనా అనారోగ్యానికి గురైతే అంబులెన్స్ గ్రామంలోకి వచ్చే పరిస్థితి లేకపోవడంతో బాధితులను ఎడ్ల బండిపై మెయిన్ రోడ్డుకు తరలించాల్సి వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. అత్యవసర వైద్య సేవలు సకాలంలో అందక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి లేకపోవడం చిన్నారుల విద్యపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది. వర్షాలు కురిసిన రోజుల్లో పిల్లలు పాఠశాలకు వెళ్లలేక చదువుకు దూరమవుతున్నారని తల్లిదండ్రులు చెబుతున్నారు. "చదివిద్దాం అంటే బడి లేదు... బడికి పంపుదాం అంటే దారి లేదు" అంటూ తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే నాయకులు గ్రామానికి వచ్చి రహదారి, తాగునీరు, విద్య, వైద్యం వంటి సమస్యలను పరిష్కరిస్తామని హామీలు ఇస్తారని, ఎన్నికలు ముగిసిన తర్వాత మాత్రం ఎవరూ గ్రామం వైపు తిరిగి చూడరని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అధికారులకి ఎన్నిసార్లు వినతులు ఇచ్చినా స్పందించడం లేదని చెబుతున్నారు. గ్రామస్తుల ఆవేదన "మా ఊరికి రోడ్డు లేక ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం. వర్షం పడితే బయటకు వెళ్లలేం. పిల్లలు బడికి వెళ్లలేరు. ఎవరైనా అనారోగ్యానికి గురైతే ఎడ్ల బండిపైనే మెయిన్ రోడ్డుకు తీసుకెళ్లాల్సి వస్తోంది. ఎన్నికల సమయంలో నాయకులు వచ్చి హామీలు ఇస్తారు కానీ తర్వాత ఎవరూ మా గ్రామం వైపు చూడరు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి మా గ్రామానికి శాశ్వత రహదారి నిర్మించాలి," అని కోరారు. పాటి, భోగంపల్లి గిరిజన గ్రామాలకు కనీస రహదారి సౌకర్యం కల్పించి విద్య, వైద్యం, ఉపాధి వంటి మౌలిక సదుపాయాలు అందేలా జిల్లా యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు తక్షణమే చర్యలు చేపట్టాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## అంతరించిపోతున్న కులవృత్తులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయానంద్ కుమ్మర కులస్తులకు రాజకీయ అవకాశాలు కల్పించాలి
- రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశ్వర్లు
- మట్టి పాత్రలు వాడుదాం ఆరోగ్యాన్ని కాపాడుకుందాం
- జిల్లా అధ్యక్షులు సూగుర్ రాములు



**ప్రజా వాయిస్.. వనపర్తి జిల్లా** గురువారం రోజు కుమ్మర శాలివాహన సంఘం ఘనపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో కుమ్మర్ల ఐక్యత కార్యక్రమం పద్మశాలి ఫంక్షన్ హాల్లో మండల అధ్యక్షులు కుమ్మరి శ్రీను అధ్యక్షతన నిర్వహించారు, ముందుగా ఈదమ్మ గుడి నుండి పూజా కార్యక్రమం నిర్వహించి అక్కడి నుంచి పద్మశాలి ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించి సభను నిర్వహించారుఈ సభకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడు కొండల వెంకటేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయానంద్ , జిల్లా అధ్యక్షులు సూగూరు రాములు మాట్లాడుతూ,,, సమాజంలో తరతరాలుగా మట్టిలో కళాత్మక పాత్రలు, రంజన్లు, ప్రమిదలు, కుండలు తయారు చేస్తూ పర్యావరణహితమైన సేవలు అందిస్తూ ఉన్నాం, నేడు ప్లాస్టిక్ స్టీల్ వస్తువులు ప్రవాహం అధికంగా ఉందని వీటిని వాడడం వల్ల క్యాన్సర్ షుగర్ బిపి వస్తుందని అన్నారు వీటిని వాడకం నిషేధించి ప్రకృతిలో కుమ్మరి చేతి నుండి చేసిన కుండలను వాడడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని మానవ మనుగడ అంతరించిపోకుండా కాపాడుకోవచ్చని అన్నారు, చెరువులపై ఆంక్షలు తీసుకురావడం వల్ల, వందలాది కుమ్మర కుటుంబాలు ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టు ఆడుతున్నాయని అన్నారు, తెలంగాణలోని చెరువులు, మిషన్ కాకతీయ కింద పూడిక తీసిన కుంటల నుండి కుమ్మర వృత్తిదారులకు ఉచితంగా బంకమట్టిని తొవ్వుకొని రవాణా చేసుకునేందుకు స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు, మైనింగ్ పోలీస్ మరియు రెవిన్యూ శాఖల వేధింపుల తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు, కుమ్మరకు ఎలక్ట్రిక్ సారీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు, కుమ్మర ఫెడరేషన్, కార్పొరేషన్కు ప్రతి ఏటా 500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు, ప్రతి కుమ్మరికి రెండు లక్షల నుండి 5 లక్షల వరకు ఉపాధి రుణాలు అందించాలని డిమాండ్ చేశారు, చేతి వృత్తులను ప్రోత్సహించే దిశగా కుమ్మరవృత్తిని ఉపాధి గృహ పరిశ్రమగా గుర్తించి తయారు మరియు బట్టిలకు నెలకు 300 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని అన్నారు, 50 సంవత్సరాలు దాటిన వారికి 5000 పింఛన్ సదుపాయం కల్పించాలని, వృత్తిరీత్యా ప్రమాదాలు జరుగుతే 10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు, కుమ్మరు తయారుచేసిన కుండలు అమ్ముకోవడం కోసం బస్టాండు, చౌరస్తాల దగ్గర షాపులు కేటాయించాలని డిమాండ్ చేశారు, కుమ్మర కులస్తులకు రాజకీయంగా అన్ని రాజకీయ పార్టీల అవకాశాలు కల్పించాలని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు, రానున్న కాలంలో కుమ్మర్ల అందరినీ ఐక్యం చేసి ప్రభుత్వాలు నుండి వచ్చే ఫలాలు అందె వరకు నిరంతరం ఉద్యమిస్తామని అన్నారు, జిల్లాలో ఉన్న కుమ్మరులు అందరు కూడా ఐక్యమత్యంతో ఉండాలని కోరారు ఈ కార్యక్రమంలో, ఉమ్మడి జిల్లా కుమ్మర సంఘం నాయకులు, శంకరయ్య, రామచంద్రయ్య, శ్రీను, నాగేష్, రఘు, వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి సుగురు రాములు, జిల్లా గౌరవ అధ్యక్షులు, సూర్య వెంకటస్వామి, జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, మాజీ జిల్లా అధ్యక్షులు బొడ్డుపల్లి పరశురాములు, యువజన సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు సూర్యవంశం గిరి, మహిళా సంఘం నాయకురాలు, లక్ష్మి, భవ్య, గీతాంజలి, లక్ష్మి, పుష్పలత, జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా సహాయ కార్యదర్శిలు, జిల్లా కమిటీ సభ్యులు, జిల్లా యువజన సంఘం నాయకులు,



## రౌడీ షీటర్ బాపురావు పై పిడి యాక్టు నమోదు

- వెల్లడించిన కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర

**ప్రజా వాయిస్ కామారెడ్డి**/ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ బెదిరింపులు, బలవంతపు వసూళ్లకు దోపిడీకి పాల్పడ్డ రౌడీషీటర్‌పై పీడీ యాక్ట్ అమలు చేసినట్లు కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు.వరుస నేరాలతో ప్రజలను భయందోళనలకు గురిచేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న రౌడీ షీటర్/ గూండాపై జిల్లా కలెక్టర్ డిటెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు.దోపిడీ, ఎక్స్‌టార్షన్, క్రిమినల్ బెదిరింపుల కేసుల్లో నిందితుడిపై ఏడాది పాటు నిర్బంధానికి చర్యలు ఉంటాయన్నారు. ప్రజల భద్రతకు విఘాతం కలిగించే సంఘవ్యతిరేక శక్తులపై కఠిన చర్యలు కొనసాగుతాయి: జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, వెల్లడించారుకామారెడ్డి జిల్లాలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ బలవంతపు వసూళ్లు, క్రిమినల్ బెదిరింపులకు పాల్పడుతున్న రౌడీషీటర్ కాట్యాడ బాపురావు అలియాస్ బాపురావు, వజ్జేపల్లి గ్రామం, సదాశివనగర్ మండలానికి చెందిన వ్యక్తిపై తెలంగాణ ప్రమాదకర కార్యకలాపాల నిరోధక చట్టం–1986 పిడి యాక్ట్ కింద జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఆశిష్ సంగ్వాన్ డిటెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.నిందితుడు గతంలో కూడా పలు క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉండగా, ఇటీవల దేవన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన దోపిడీ కేసు, గాంధారి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన రెండు ఎక్స్‌టార్షన్, క్రిమినల్ బెదిరింపుల కేసుల్లో అతడు కీలక నిందితుడుగా ఉన్నాడు. ప్రజలను బెదిరించి అక్రమంగా డబ్బులు వసూలు చేయడం, జర్నలిస్టు పేరుతో భయాందోళనలు సృష్టించడం, దోపిడీలకు పాల్పడినటువంటి వంటి చర్యలతో ప్రజా శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగించినందున అతనిపై యాక్ట్ అమలు చేశారు.ప్రస్తుతం నిందితుడు న్యాయపరమైన నిర్బంధంలో ఉండగా, జిల్లా కలెక్టర్ జారీ చేసిన డిటెన్షన్ ఉత్తర్వులను సంబంధిత అధికారులు నిజామాబాద్ సెంట్రల్ జైలులో అందజేశారు.జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, మాట్లాడుతూ, ప్రజల్లో భయం, అభద్రత సృష్టించే దోపిడీలు, బలవంతపు వసూళ్లు, క్రిమినల్ బెదిరింపులు వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడే వ్యక్తులపై సాధారణ చట్టాలతో పాటు అవసరమైతే పీడీ యాక్ట్‌ను కూడా కఠినంగా అమలు చేస్తామని తెలిపారు. ప్రజా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే సంఘవ్యతిరేక శక్తులపై కామారెడ్డి జిల్లా పోలీసులు ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు కొనసాగిస్తారని స్పష్టం చేశారు.

## గీత కార్మికులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి..!

- మిర్యాలగూడలో గీతన్నల చైతన్య యాత్రకు ఘన స్వాగతం
- పెండింగ్ ఎక్స్‌గ్రేషియా డబ్బులు బాధితులకు ఇవ్వాలి
- గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఈ నెల ఒకటో తేదీ నుండి ప్రారంభమైన గీతన్నల చైతన్య యాత్ర గురువారం మిర్యాలగూడ పట్టణానికి చేరుకుంది.స్థానిక తడకమళ్ళ క్రాస్ రోడ్ నుండి ప్రారంభమైన గీత కార్మికుల ప్రదర్శన రాజీవ్ చౌక్ వరకు చేరుకుంది.ప్రదర్శన చైతన్య యాత్రలో పాల్గొన్న నాయకులకు స్థానిక సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర నాయకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రంలో కోటీ తాటి ఈత వృక్ష సంపదను ప్రకృతి ప్రసాదించిందని,వీటి పై ఐదు లక్షల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నారని వారు తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తిలో మార్పులు తీసుకొచ్చి గీత కార్మికుల ఉపాధిని ప్రభుత్వం మెరుగుపరచాలని డిమాండ్ చేశారు.వృత్తిలో జరుగుతున్న ప్రమాదాలను నివారించాలని అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలను పెన్షన్ రూ:4000, ఎక్స్‌గ్రేషియా పదివేల పెంచాలని డిమాండ్ చేశారు.చెట్ల పెంపకానికి భూమి ఇవ్వాలని కోరారు ప్రభుత్వం జీవో ప్రకారం 50 సంవత్సరాల పైబడిన గీత కార్మికులందరికీ తెలిసిన ఇవ్వాలని ప్రతి సొసైటీకి ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని వర్క్ డిమాండ్ చేశారు.నీరాకు రాష్ట్ర బడ్జెట్లో కేటాయించిన 25 కోట్లు, సంక్షేమాన్ని కేటాయించిన 67 కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరారు. పెద్ద జిల్లాలో తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలని యువతీ యువకులకు ఉపాధి కల్పించాలని ఏజెన్సీ ఏరియాలో గీతం చేసే గీత కార్మికులందరికీ సభ్యత్వం ఇచ్చి సొసైటీలు పీఎఫ్ టీలు ఏర్పాటు చేయాలని అదేవిధంగా సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు.ఆగస్టు 18న సర్వాయి పాపన్న జయంతి రోజున హైదరాబాదులోని ట్యాంక్ బండ్ పై విగ్రహాన్ని ప్రదర్శించాలని కోరారు. ఈ సమావేశానికి గీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు సీతారాములు అధ్యక్షత వహించగా సభలో గోవిందు వెంకన్న,వెంకట నరసయ్య, సాంబయ్య, అంజిబాబు,సిఐటియు నాయకులు మల్లేష్ గౌతం రెడ్డి,రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు,రంగారెడ్డి, ముత్యాల వెంకటయ్య,ముత్యలసతీష్, బంటు ఎల్లయ్య,మహిళా సంఘం నాయకులు వరలక్ష్మి, అరుణ, గోవర్ధన, కౌసల్య తదితరులు పాల్గొన్నారు.






## పుస్తకాలకే కాదు... జీవితాన్నీ నేర్పిస్తున్న స్కూల్!

- పోలీస్ స్టేషన్, టస్సర్ సిల్క్ కేంద్రాల్లో విద్యార్థులకు ప్రత్యక్ష అనుభవాలు
- గుడ్ మార్నింగ్ గ్రామర్ హై స్కూల్ వినూత్న విద్యా విహారాలు

**ప్రజా వాయిస్ మహాదేవపూర్ ప్రతినిధి** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్, మండలం విద్య అంటే కేవలం పుస్తకాలకే పరిమితం కాదని, ప్రత్యక్ష అనుభవాలే నిజమైన జీవిత పాఠాలని నిరూపిస్తూ మహదేవ్‌పూర్‌లోని గుడ్ మార్నింగ్ గ్రామర్ హై స్కూల్ మరోసారి ప్రత్యేకత చాటుకుంది. విద్యార్థుల్లో సామాజిక అవగాహన, పరిశీలనా నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, బాధ్యతాయుతమైన పౌరసత్వ భావన పెంపొందించాలనే లక్ష్యంతో పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యా విహారాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.పాఠ్యాంశంలో భాగంగా ఎస్‌కేజీ విద్యార్థులు మహదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు చిన్నారులకు ఆత్మీయ స్వాగతం పలికి, పోలీస్ శాఖ విధులు, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియమాలు, అత్యవసర సేవలు, సమాజంలో పోలీసుల పాత్రను సులభంగా వివరించారు. అనంతరం విద్యార్థులు పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించి, అధికారులతో ముచ్చటిస్తూ పలు అంశాలపై అవగాహన పెంచుకున్నారు.అదే సమయంలో 7వ తరగతి విద్యార్థులు మహదేవ్‌పూర్‌లోని టస్సర్ సిల్క్ వస్త్ర తయారీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ టస్సర్ వస్త్రాల తయారీ విధానం, నేయడం, సంప్రదాయ కళాకారుల నైపుణ్యం, వారి శ్రమ, స్థానిక చేనేత పరిశ్రమ ప్రాధాన్యతను ప్రత్యక్షంగా వీక్షించారు. ఈ పర్యటన ద్వారా ప్రాంతీయ కళలు, సంస్కృతి, చేనేత రంగం, ఉపాధి అవకాశాలపై విద్యార్థులకు విలువైన అవగాహన లభించింది.ఇలాంటి విద్యా విహారాలు పాఠ్యాంశాలను జీవిత అనుభవాలతో అనుసంధానించడమే కాకుండా, విద్యార్థుల్లో జిజ్ఞాసను పెంపొందించి, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత, సమస్యలను అర్థం చేసుకునే సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ, గుడ్ మార్నింగ్ గ్రామర్ హై స్కూల్‌లో నాణ్యమైన విద్యతో పాటు అనుభవాత్మక బోధన, విలువలతో కూడిన విద్య, వ్యక్తిత్వ వికాసం, సమగ్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. విద్యార్థులను భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనే సమర్థ పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని వెల్లడించారు.విద్యా విహారాల విజయవంతానికి సహకరించిన మహదేవ్‌పూర్ పోలీస్ శాఖ అధికారులు, టస్సర్ సిల్క్ తయారీ కేంద్రం నిర్వాహకులు, కళాకారులకు పాఠశాల యాజమాన్యం హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది.పుస్తకాలలోని పాఠాలను ప్రత్యక్ష జీవిత అనుభవాలతో మేళవిస్తూ, భావి భారత పౌరులను తీర్చిదిద్దే దిశగా గుడ్ మార్నింగ్ గ్రామర్ హై స్కూల్ మరో ముందడుగు వేసిందని పలువురు అభినందించారు.

## అడవి పంది దాడిలో మృతిచెందిన మహిళ కుటుంబానికి ఎమ్మెల్సీ దండే విఠల్ చెక్కు అందజేత

ప్రజా వాయిస్ ఆసిఫాబాద్ కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసు బాలాజీ ఆనుకోడ గ్రామానికి చెందిన డుబ్బుల లక్ష్మి గతంలో రవీంద్రనగర్ ప్రాంతంలో అడవి పంది దాడిలో మృతి చెందగా, ప్రభుత్వం వారి కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేసింది.తొలి విడతగా రూ.5 లక్షల చెక్కును మృతురాలి కుమారుడు డుబ్బుల నారాయణకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్, ఫారెస్ట్ డివిజనల్ అధికారి అప్పయ్య అందజేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.కార్యక్రమంలో చింతల మానేపల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారి సుభాష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డుబ్బుల నానయ్య, జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యుడు డుబ్బుల వెంకన్న, కార్జెల్లి సర్పంచ్ చౌదరి నారాయణ, అటవీ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# ఆదివాసీల హక్కులకు చట్టాలకు రక్షణ గా తుడుం- దెబ్బ

- ఘనంగా తుడుం దెబ్బ ఆవిర్భావ దినోత్సవం లో తుడుం దెబ్బ నాయకులు



**ప్రజా వాయిస్, కొత్తగూడ :** ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ మండల కమిటీ ఆధ్వర్యంలో తుడుం దెబ్బ ఆవిర్భావ దినోత్సవం నీ ఘనంగా నిర్వహించారు తుడుం దెబ్బ నాయకులు ఆదివాసీ ఉద్యోగులు రామన్న గూడెం గ్రామ పటేల్ భీం విగ్రహానికి పూల మాల వేసి నేటితో తుడుం దెబ్బ సంఘం ఏర్పాటు అయి 30 సంవత్సరలు పూర్తయిన సందర్భంగా తుడుందెబ్బ జెండాని ఆవిష్కరించడం జరిగింది
అనంతరం తుడుం దెబ్బ నాయకులు మాట్లాడుతూ ఆదివాసి ప్రజల స్వేచ్ఛ స్వతంత్రం కోసం తమ జాతి మనుగడ కోసం పోరాడుతూ ఎంతోమంది అమరులైనారని వారి త్యాగాలను స్మరించుకుంటూ
జల్ ! జంగిల్!! జమీన్!!! మావ నాటే మావ రాజ్ (మా గూడెం లో – మా రాజ్యం )కోసం బ్రిటిష్ వారికి నైజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేకమంది ఆదివాసి పోరాట వీరులు కొమురం భీం బిర్స ముండా రాంజీ గోండ్ సోయం గంగులు గంటం దొర మల్లు దొర సమ్మక్క సారలమ్మ రాణి దుర్గావతి లాంటి అనేకమంది ఆదివాసి పోరాట వీరులు వీరమరణం చెందిన తర్వాతనే ఆదివాసుల రక్షణ భూముల రక్షణ కోసం అనేక రకాల చట్టాలు తీసుకువచ్చింది.
భారతదేశానికి స్వతంత్రం వచ్చిన తర్వాత 1950 జనవరి 26న రాజ్యాంగం ఏర్పాటుచేసినప్పుడు షెడ్యూల్ తెగలుగా గుర్తించడం షెడ్యూల్ తెగల కోసం భారత రాజ్యాంగంలో ఐదవ షెడ్యూల్ ఏర్పాటు చేసి ప్రత్యేకమైన భూములు రక్షణ కోసం గిరిజనేతరుల వలసలను అరికట్టడానికి 1/59,1/63,1/70 చట్టాలను తీసుకువచ్చింది విద్యా ఉద్యోగం రాజకీయ రిజర్వేషన్ల కోసం ప్రత్యేకమైన అధికారాలను తీసుకువచ్చింది ఆదివాసులకు కేటాయించిన హక్కులు చట్టాలను పాలక ప్రభుత్వాలు అమలు చేయడం లేదని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న ఆదివాసి మేధావులు విద్యావంతులు, ఉద్యోగులు, విద్యార్థులు సానుభూతిపరులు తెలంగాణలోని మేధావులు కలిసి సమావేశమై అందరి యొక్క ఆలోచన మేరకు తేదీ : 06.07 1996 లో ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ గ పేరు పెట్టారు.దీనికి అనుబంధ సంఘాలుగా ఉద్యోగ విద్యార్థి మహిళా కార్మిక రైతు సంఘాలు ఏర్పాటు చేయాలని గ్రామస్థాయి నుండి జిల్లా రాష్ట్రస్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని బైలా నిబంధనలు ఏర్పాటు చేశారు. కొన్ని ప్రధాన డిమాండ్స్ తయారు చేయడం ఏజెన్సీ ప్రాంతంలోని 30 ఆదిమ తెగలను కలుపుకొని ఆదివాసిలు ఉద్యమించాలని బైలాలో చేర్చారు.
తుడుం దెబ్బ మొదటి అధ్యక్షులుగా దబ్బకట్ల నర్సింగ రావు ణి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు తుడుం దెబ్బ ఆధ్వర్యంలో అదిలాబాద్ నుండి శ్రీకాకుళం వరకు తుడుం దెబ్బ సంఘం విస్తరిస్తున్న కాలంలో 1998 సంవత్సరంలో పార్లమెంటు ఎన్నికలు రావడంతో భద్రాచలం పార్లమెంటుకి తుడుం దెబ్బ నుండి కురుసం సుబ్బారావుని ఎన్నికలలో పోటీ చేసి ఓడిపోవడంతో ప్రధాన నాయకత్వం నిరుత్యానికి లోనై ఓటమి కారణాలు సమక్ష జరగకుండా ఒక సంవత్సరం పాటు ప్రధాన నాయకత్వం వేనకడుగు వేయడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా గుండాల మండలం నాయకులు జవాజి లక్ష్మీనారాయణ తన భుజ స్కంధాలపై వేసుకొని ఆదివాసీ హక్కుల పోవట సమితి తుడుం దెబ్బ మలిదశ ఉద్యమాన్ని, నిర్మాణాలను స్థాపించడం లోప్రధాన భూమిక పోషించారు. ఈ సందర్భంగా బుర్స పోచయ్య వట్టం నారాయణ శీడం శంభూ దాదా సిద్దబోయిన లక్ష్మినారాయణ వట్టం ఉపేందర్ ఉద్యమంలోకి వచ్చారు.నేటికీ ఎంతో మంది ఆదివాసీ యువకులు తుడుం దెబ్బ ఉద్యమం లో చురుకుగా పని చేస్తూ తమ హక్కుల చట్టల అమలు కోసం ఉద్యమిస్తున్నారు.
30 ఏళ్ల తుడుం దెబ్బ ప్రస్థానంలో ఆదివాసి సంస్కృతి సాంప్రదాయాలు హక్కులు చట్టాలు జీవో ల రక్షణ తో పాటు తెలంగాణ రాష్ట్రంలో ఏజెన్సీ చట్టాలు అమలు కావాలని పోరాడుతు సింగరేణి ఓపెన్ కాస్ట్,పోలవరం ప్రాజెక్ట్,కావ్వాల టైగర్ జోన్,నేషనల్ పార్క్,కంతనపల్లి ప్రాజెక్ట్, బయ్యారంహుక్కు ఆదివాసీల హక్కు, పోరాటాలు కొనసాగాయి.ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర డిమాండ్ లో భాగంగా ఆదివాసీలకు స్వయంపాలన కావాలని డిమాండ్ తో తెలంగాణ ఉద్యమానికి మద్దతు ఇవ్వడం జరిగింది. తెలంగాణ వచ్చిన తర్వాత ఆదివాసి ప్రాంతాలైన ఆదోని షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న హక్కులు చట్టాలు సంక్షేమ పథకాలు అమలు చేయడానికి రాష్ట్ర వ్యాప్తంగా తుడుం దెబ్బ నాయకత్వంలో ఆదివాసి ప్రజల పోరాటం చేస్తుంటే అమలు చేయాలని ప్రభుత్వాలు ఉద్యమ నాయకుల పై నిర్బంధ కొనసాగిస్తూ రకరకాల అక్రమ కేసులు పెట్టడం జరిగింది శత్రువులకు తలవంచకుండా తుడుం దెబ్బ ప్రధాన నాయకత్వం వెనుకంజ వేయలేదు.
నేటికీ తుడుం దెబ్బ తెలంగాణ రాష్ట్రంలో ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసి చట్టాల హక్కులు జీవో లను అమలుచేయాలనీ జీవో నెంబర్ 3 అమలుచేయాలనీ, అక్రమంగా ST జాబితాలో చేరిన రిజర్వేషన్ను ఆదివాసులకు కాకుండా అనుభవిస్తున్న లంబాడీల తొలగింపు, నిరంతరం పోరాటం చెస్తుంది ఆదివాసి ప్రజలు ఉద్యోగులు మేధావులు యువతీ యువకులు తుడుం దెబ్బ పోరాటంలో భాగస్వాములై భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాలని అన్నారు.
కార్యక్రమం లో తుడుం దెబ్బ నాయకులు పూనెం సందీప్ మల్లెల సారయ్య కుంజ నర్సింగ రావు సిద్దబోయిన భద్రయ్య మల్లెల లక్ష్మన్ అలెం జంపయ్య వజ్జ జగదీశ్వర్ పటేల్ రామన్న గూడెం తోలేం వెంకన్న ఆదివాసీ ఉద్యోగులు సువర్ణ పాక సుబ్బారావు అయిలబోయిన జంపయ్య రేగా పాపారావు జెజ్జరి రాధిక గుమ్మడి లలిత తదితరులు పాల్గొని నివాళిలు అర్పించారు

## తెలంగాణ అస్తిత్వానికి జయశంకర్.. ఉద్యమానికి ఊపిరి గద్దర్



**ప్రజా వాయిస్ మహాదేవపూర్:** ప్రతినిధి తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య జయశంకర్ సిద్ధాంత బలంగా, ప్రజాకవి గద్దర్ ఉద్యమ స్ఫూర్తిగా నిలిచారని మహాదేవపూర్ మండల ప్రిన్సిపల్ డాక్టర్ జన్ను విజయకుమార్ పేర్కొన్నారు.
మహాదేవపూర్ మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో గురువారం ఆచార్య జయశంకర్ జయంతి, ప్రజాకవి గద్దర్ వర్ధంతి సందర్భంగా స్మారక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జన్ను విజయకుమార్ అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ పోరాటానికి ఆచార్య జయశంకర్ తన జీవితాన్నే అంకితం చేసి ఉద్యమానికి సిద్ధాంతకర్తగా నిలిచారని అన్నారు. ప్రత్యేక రాష్ట్ర అవసరాన్ని గ్రామస్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ వేదికల వరకు చాటిచెప్పి తెలంగాణ ఆకాంక్షను ప్రపంచానికి పరిచయం చేశారని పేర్కొన్నారు. ప్రజాకవి గద్దర్ తన గేయాలు, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా ఉద్యమానికి అపారమైన చైతన్యాన్ని తీసుకొచ్చారని, సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం జీవితాంతం పోరాడిన ప్రజాకవిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. ఆయన పాటలు ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించి తెలంగాణ ఉద్యమాన్ని మరింత బలోపేతం చేశాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఆచార్య జయశంకర్, గద్దర్ ఇద్దరి పాత్ర చారిత్రాత్మకమని, వారి ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి తెలంగాణ పౌరుడి బాధ్యత అని అన్నారు. వారి ఆలోచనలు, ఆదర్శాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇద్దరు మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు ఆచార్య జయశంకర్, గద్దర్ తెలంగాణ ఉద్యమంలో పోషించిన పాత్రపై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం చివరలో కళాశాల ఐక్యుఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ పొరిక రాజు వందన సమర్పణ చేయగా, కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## డిగ్రీ అడ్మిషన్లకు మరో అవకాశం

- ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పివి గీతాలక్ష్మీ పట్నాయక్



**ప్రజా వాయిస్/వికారాబాద్:** వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్పెషల్ ఫేస్ దోస్త్ ఆన్లైన్ ప్రక్రియలో చివరి అవకాశం గురువారం నుంచి ప్రారంభమైందని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పివి గీతాలక్ష్మీ పట్నాయక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తేదీ నుండి ఈనెల 11 వరకు రిజిస్ట్రేషన్, 6 నుండి 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ ఎంపిక ఉంటుంది. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. కళాశాలలో వివిధ కోర్సులు బి ఏ తెలుగు ,ఇంగ్లీష్ మీడియం, బీకాం కంప్యూటర్స్, బిఎస్సి లైఫ్ సైన్స్, బిఎస్సి ఫిజికల్ సైన్స్ ఇంగ్లీష్ మీడియం కోర్సులలో సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

## బాధిత కుటుంబలకు అండగా ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి



**ప్రజా వాయిస్/రాయపర్తి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం రాగన్నగూడెం గ్రామంలో రస్తాపురం సోమక్క ఇటీవల అనారోగ్యంతో మరణించగా, గురువారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం ఒక్కటీ అయిల్ క్యాన్ ను సహాయం చేసిన
ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు
పరుపాటి శ్రీనివాస్ రెడ్డి ఈ సహాయంను వారి కుటుంబ సభ్యులకు అందించిన రాయపర్తి మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి సంకినేని ఎల్లస్వామి స్థానిక నాయకులు అయిన గ్రామ మాజీ సర్పంచ్ ★కంది ప్రభాకర్ మాజీ ఉప్ప సర్పంచ్ బలగని రాజమ్మ పార్టీ ముఖ్య నాయకులు సరికొండ రాజిరెడ్డి సరికొండ యాకుబ్ రెడ్డి రెంటల రాజిరెడ్డి కోలా యాకయ్య సుదం కిషన్ బలగని బిక్షపతి కంది విరయ్య కంది , బిక్షపతి గోపు పద్మ అగయ్య దండు కుమార్ దండు రాములు కంది వెంకటేశర్లు తదితరులు పాల్గొన్నారు..

## జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయం..

- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రభాకర్..
- పటాన్‌చెరు నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక
- ఘనంగా పటాన్‌చెరు నియోజకవర్గ 3వ మహాసభలు
- అధ్యక్షుడిగా బాదిని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కొత్తకొండ సత్యం ఎన్నిక

**పటాన్ చెరువు ప్రజావాయిస్ :** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తోందని రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రభాకర్ అన్నారు. కష్టకాలంలో ప్రతి జర్నలిస్టుకు అండగా నిలిచి, సంక్షేమ పథకాలు అందే వరకు సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని పేర్కొన్నారు. గురువారం పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో ఐబీ అతిథి భవనంలో టీడబ్ల్యూజేఎఫ్ 3వ మహాసభల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభలకు జిల్లా అధ్యక్షులు ఎల్గోయి ప్రభాకర్, జిల్లా కార్యదర్శి సురేందర్, రాష్ట్ర నాయకులు మేకల కృష్ణయ్య, ప్రభు, జాతీయ కార్యవర్గ సభ్యులు సుదర్శన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. జర్నలిస్టుల ఐక్యత, హక్కుల సాధన, సంక్షేమ కార్యక్రమాల అమలులో టీడబ్ల్యూజేఎఫ్ ఎల్లప్పుడూ ముందుంటుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమానికి పటాన్ చెరు నియోజకవర్గ వివిధ మండల జర్నలిస్టులు హాజరై నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, సంక్షేమ అంశాలపై విస్తృతంగా చర్చించారు. వృత్తి గౌరవాన్ని కాపాడుతూ, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమ పథకాల సాధన కోసం సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, సంఘ బలోపేతానికి అంకితభావంతో కృషి చేస్తామని స్పష్టం చేశారు.

### నూతన కమిటీ

**గౌరవ సలహాదారులు:** వాసుదేవ్, శ్రీనివాస్, అధ్యక్షుడు: బాదిని శ్రీనివాస్
**ప్రధాన కార్యదర్శి:** కొత్తకొండ సత్యం
**ఉపాధ్యక్షులు:** రవీందర్ చారి, నరసింహారెడ్డి, సంగమేశ్వర్
**సహాయ కార్యదర్శులు:** గిరి, ప్రసాద్, కృష్ణ గౌడ్, రాము
**కోశాధికారి:** భానుచందర్
**ప్రచార కార్యదర్శి:** ముద్దంగుల ఎల్లయ్య
**ఈసీ కమిటీ సభ్యులు:** గణేష్,రాజు,రాజశేఖర్,విజయ్,రమేష్ ను ఎన్నుకున్నారు.

## జయశంకర్ ఆశయాల సాధనే ఆయనకు నిజమైన నివాళి

- జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బట్టు కరుణాకర్



**ప్రజా వాయిస్, భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో తెలంగాణ సిద్ధాంతకర్త, మహామేధావి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ 92వ జయంతిని పురస్కరించుకుని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా బట్టు కరుణాకర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధనకు సిద్ధాంతపరమైన దిశానిర్దేశం చేసి ఉద్యమానికి మేధోబలాన్ని అందించిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కొనియాడారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, స్వాభిమానం, సామాజిక న్యాయం కోసం ఆయన జీవితాంతం చేసిన కృషి, త్యాగాలు చిరస్మరణీయమని అన్నారు.
జయశంకర్ సార్ కలలు కన్న ప్రజల తెలంగాణను నిర్మించడమే ఆయనకు అందించే గొప్ప నివాళి అని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను, జయశంకర్ సార్ ఆశయాలను భావితరాలకు చేరవేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. యువత ఆయన జీవితం నుంచి స్ఫూర్తి పొంది సమాజాభివృద్ధి, ప్రజాసేవ కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ ఆశయ సాధనకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం, సమాన అభివృద్ధి కోసం నిరంతరం పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు చల్లూరి మధు, వెంకీ యాదవ్, దాట్ల శ్రీను, బుచ్చయ్య, విజయ్, బౌత్ రమేష్, రాజేష్, పట్టణ కాంగ్రెస్ నాయకులు మాకోటి శ్వేత, ప్రభాకర్, కురిమిళ్ల శ్రీను, బొడ్డు రేణుక, పద్మ, అశోక్, సహదేవ్, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్, అనుబంధ విభాగాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ సార్‌కు ఘన నివాళులర్పించారు.

## రాష్ట్రస్థాయి జావలిన్ పోటీలకు విద్యార్థిని అంజలి ఎంపిక



**ప్రజా వాయిస్ మహాదేవపూర్ ప్రతినిధి :** మహాదేవపూర్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని పెద్ది అంజలి రాష్ట్రస్థాయి జావలిన్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల జయశంకర్ భూపాలపల్లి జిల్లా అంబేద్కర్ స్టేడియంలో అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి జావలిన్ త్రో పోటీల్లో అంజలి ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది.
తెలంగాణ స్టేట్ 5వ జావలిన్ డే సెలబ్రేషన్స్‌లో భాగంగా ఆగస్టు 7న హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జావలిన్ పోటీల్లో అంజలి పాల్గొననున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ పాఠశాల విద్యలోనే కాకుండా క్రీడల్లోనూ ప్రతిభ చాటుతూ ప్రతి సంవత్సరం రాష్ట్రస్థాయిలో రాణిస్తోందన్నారు. జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన అంజలిని అభినందిస్తూ, ఆమెకు ప్రత్యేక శిక్షణ అందించి పాఠశాలకు క్రీడల్లో మంచి గుర్తింపు తీసుకొస్తున్న పీడీ గుర్‌సింగ్ పూర్ణిమను అభినందించారు. రాష్ట్రస్థాయిలోనూ అంజలి ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొని విద్యార్థిని అంజలిని అభినందించింది.

## తావు నాయక్ శ్రద్ధాంజలి ఘటించిన నల్గొండ జిల్లా ఎమ్మెల్సీ



**ప్రజా వాయిస్ :** తిరుమలగిరి మండల కేంద్రంలోని జాల్ తండాలో తండా వాస్తవ్యులు జటావత్ లచ్చు నాయక్, జటావత్ బాలు నాయక్, వారి తండ్రి జటావత్ తావు నాయక్ వృద్ధాప్యంతో మరణించడం జరిగింది ఈరోజు వారి నివాసంలో వారి పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించిన నల్గొండ జిల్లా శాసనమండలి సభ్యులు ఎంసీ కోటిరెడ్డి తాగు నాయక్ మృతి పట్ల వాళ్ల కుటుంబ సభ్యులకు తన ప్రాంగణ సానుభూతిని తెలియజేశారు ఎమ్మెల్సీ తో పాటు తండా పెద్దలు బావుజీ నాయక్, పిల్లిగుండ్ల తండా సర్పంచ్ సక్క నాయక్, మాజీ సర్పంచులు స్వామి నాయక్, పంతులు నాయక్, తండా ఉపసర్పంచ్ మోతిలాల్, యువ నాయకులు శ్రావణ్ నాయక్, నరేష్ నాయక్ తునికి నూతల మాజీ సర్పంచ్ హనుమాన్ నాయక్ మాటూరు మాజీ సర్పంచ్ పాండు నాయక్, మాజీ మార్కెట్ డైరెక్టర్ బూడిద హరికృష్ణ యాదవ్, నెల్లికల్ ఉప సర్పంచ్ బాల నరసింహ, రమావత్ రమేష్ నాయక్, ప్రకాష్ నాయక్ మరియు తండావాసులు తదితరులు పాల్గొన్నారు

# రూ.1500కోట్లతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు...

- గ్రామ గ్రామాన ఇందిరమ్మ ఇండ్లు, సిసి రోడ్ల నిర్మాణాలు....
- నమిలిగొండలోనే కోటి 50లక్షలతో సిసి రోడ్లు...
- కళ్ళు ఉండి చూడలేనివారిలాగా కొంతమంది మాట్లాడుతున్నారు..
- కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసే ప్రజా సంక్షేమ పథకాలు వారి కళ్ళకు కనిపించడం లేదు..
- ఆగస్టు 15నుండి రాష్ట్రంలో కొత్త వితంతు పెన్షన్లు మంజూరు..
- రైతు, మహిళా, పేద వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీట..
- వారం రోజులలో దేవాదుల రిజర్వాయర్ల ద్వారా ఆరుతడి పంటలకు సాగు నీరు అందించే ప్రయత్నం చేస్తున్నా....
- వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రైతులు పంటలు సాగు చేసుకోవాలి......
- మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజా వాయిస్/స్టేషన్ ఘనపూర్ :** జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండలం నమిలిగొండ కస్తూరిభా గాంధీ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన 2లక్షల 50వేలతో ఆర్.ఓ వాటర్ ప్లాంట్ మరియు లక్షా 50వేలతో హైమాస్ లైట్లను ప్రారంభించారు. అలాగే 40లక్షలతో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి కాసేపు ఉపాధ్యాయునిగా మారి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. అనంతరం పాఠశాలకు నేను ఇచ్చిన హామీలను నెరవేర్చనానని, ఉత్తమ ఫలితాలు సాధించి ఉపాధ్యాయులు, విద్యార్థులు మీ బాధ్యతలను నెరవేర్చాలని సూచించారు. అలాగే నమిలిగొండ గ్రామంలో 23లక్షలతో నిర్మించనున్న సిసి రోడ్డు నిర్మాణానికి మరియు కోటి రూపాయలతో నిర్మించనున్న కూడా రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు.
అనంతరం స్టేషన్ ఘనపూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో స్టేషన్ ఘనపూర్ మండలనికి సంబందించిన 38మంది కల్యాణ లక్ష్మి – షాదీ ముబారక్ లబ్ధిదారులకు 38లక్షల 04వేల 408రూపాయల విలువగల చెక్కులను పంపిణి చేశారు. తెలంగాణ సిద్ధాంతకర్త, ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన మహనీయులు ప్రొఫెసర్ జయశంకర్ సార్ అని కొనియాడారు. తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం అయన చేసిన ఉద్యమం చిరస్మరణీయమని అన్నారు. సమాజ అభివృద్ధి కోసం విద్యా, సామజిక చైతన్యం, ఎంతో కీలకమని ఆయన చూపిన మార్గం ప్రతీ ఒక్కరూ ఆచరించదగిందని తెలిపారు. జయశంకర్ సార్ ఆకాంక్షించిన తెలంగాణ, అభివృద్ధి చెందిన తెలంగాణ, సామజిక తెలంగాణ సిద్దించే దిశగా అయన ఆశయాలకు అనుగుణంగా ప్రతీ ఒక్కరు పని చేసినప్పుడే ఆ మహానుభావునికి నిజమైన నివాళులు అర్పించినట్లు అవుతుందని పిలుపునిచ్చారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ..... రాష్ట్ర ప్రభుత్వం అప్పుల ఊబిలో ఉన్నప్పటికీ రైతు, మహిళా, పేద వర్గాల సంక్షేమానికి పెద్ద పీట వేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు కొంతమంది కళ్ళకు కనిపించడం లేదని అన్నారు. రాష్ట్రంలో 22వేల 500కోట్లతో 4లక్షల 50వేల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 13వేల 500కోట్లతో ఒక్కొక్కరికి 6కిలోల చొప్పున ఉచిత సన్న బియ్యం పంపిణి, గృహ అవసరాలకు 200యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు వంటి అనేక పథకాలు పేద వర్గాల ప్రజలకు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. ఈ ఆగస్టు 15నుండి రాష్ట్రంలో కొత్త వితంతు పెన్షన్లు మంజూరు కాబోతున్నాయని వెల్లడించారు.
స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో 1500కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని నియోజకవర్గంలోని ఏ గ్రామానికి వెళ్లిన ఇందిరమ్మ ఇండ్లు, సిసి రోడ్లు, గ్రామ పంచాయితీ భవనాలు, వివో భవనాలు, అంగన్వాడీ భవనాలు, కమ్యూనిటీ భవనాలు, మహిళా భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. ఒక్క నమిలిగొండ గ్రామంలోనే కోటి 50లక్షల సిసి రోడ్లు, గ్రామ పంచాయతీ భవనం, 30ఇందిరమ్మ ఇండ్లు, వివో భవనం, కమ్యూనిటీ హాల్లు మంజూరు చేసుకున్నామని తెలిపారు. గత 15ఏళ్ళు ఎమ్మెల్యే గా ఉన్న వ్యక్తి ఎం పని చేశాడో.... ఇప్పుడు నేను ఎలాంటి అభివృద్ధి పనులు చేస్తున్నానో ప్రజలు గమనించాలని కోరారు. రాబోయే రోజుల్లో నమిలిగొండ గ్రామాన్ని ప్రత్యేక దృష్టితో అన్ని రకాలుగా అభివృద్ధి చేసే బాధ్యత నాదని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు తీవ్ర సాగు నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. నిన్ననే రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ని కలిసి స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో దేవాదుల రిజర్వాయర్ల ద్వారా ఆరుతడి పంటలకు సాగు నీరు అందించాలని కోరడం జరిగిందని మంత్రి వెంటనే స్పందించి అధికారులకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఇప్పటికే ధర్మసాగర్ రిజర్వాయర్ ద్వారా సాగు నీరు విడుదల చేశామని, వారం రోజులలో ఘనపూర్, అశ్వరావుపల్లి, గండి రామారం రిజర్వాయర్ల ద్వారా కూడా సాగు నీరు విడుదల చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడించారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. ఎల్ నీనో ప్రభావంతో ఏర్పడిన కరువుకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం అని కొంతమంది సిగ్గు లేని సన్నాసులు మాట్లాడుతున్నారని తీవ్రం స్థాయిలో విమర్శించారు.

## డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ భద్రత కొనసాగింపు కోసం మహాధర్నా



**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా:** కాగజ్‌నగర్ మండలం డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌కు కల్పించిన బుల్లెట్ ప్రూఫ్ వెహికల్, గన్‌మ్యాన్ భద్రతను తొలగించవద్దని డిమాండ్ చేస్తూ కాగజ్‌నగర్‌లోని తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద మహాధర్నా నిర్వహించారు.
ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న ప్రవీణ్ కుమార్‌కు తగిన భద్రత కొనసాగించడం ప్రభుత్వ బాధ్యత అని, బుల్లెట్ ప్రూఫ్ వెహికల్, గన్‌మ్యాన్ భద్రతను యథాతథంగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ నియోజకవర్గ నాయకులు, నాయకురాళ్లు, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రవీణ్ కుమార్ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు.

## రాష్ట్ర ఏర్పాట్ లో ప్రొఫెసర్ జయశంకర్ సేవలు మరువలేనివి

### మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ తిరుపతమ్మ సుధీర్



**ప్రజా వాయిస్, కోదాడ:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ప్రొఫెసర్ జయశంకర్ సార్ చేసిన సేవలు మరువలేనివని కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్ అన్నారు. గురువారం కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ప్రొపెసర్ జయశంకర్ సార్ 92 వ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. అనంతరం చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్ మాట్లాడుతూ తెలంగాణా ఉద్యమం లో జయశంకర్ కీలక పాత్ర పోసించి రాష్ట్ర ఏర్పాటలో కీలకపాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ తమనేబోయిన వీరబాబు, మనెమ్మ, సిబ్బంది సిబ్బంది ఆటో యూనియన్ వాళ్లు పార్టీ నాయకులు పాల్గొనడం జరిగింది.

## తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళి



**ప్రజా వాయిస్ కొత్తగూడ :** కొత్తగూడ మండల కేంద్రంలోని ఎంపీ యుపిఎస్ పాఠశాలలో తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రత్యేక తెలంగాణ ఊపిరిగా తన జీవితాన్ని ధార పోసిన ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా కేంద్రంలోని ఎంపీ యు పి ఎస్ పాఠశాల హెచ్ ఎం గుమ్మడి లలిత ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉపాధ్యాయునీలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కన్నెపల్లిలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి




**ప్రజా వాయిస్, ఆసిఫాబాద్ :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, కౌటాల మండలం: కన్నెపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో జయశంకర్ కృషి చిరస్మరణీయమని, ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని కార్యక్రమంలో నాయకులు తెలిపారు. సర్పంచ్ మోర్లె పార్వతి, ఉప సర్పంచ్ మోర్లె సమత–రాజు, గ్రామపంచాయతీ కార్యదర్శి తుడుపు నూరి సాయి కృష్ణ, వార్డు సభ్యులు, యువ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా దులం మమతా సతీష్ గౌడ్ జన్మదిన వేడుకలు

**ప్రజా వాయిస్/జనగామ (కొడకండ్ల) :** జనగామ జిల్లా కొడకండ్ల గ్రామ సర్పంచి దులం మమతా సతీష్ గౌడ్ జన్మదిన వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయి ఈ కార్యక్రమానికి కొడకండ్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ధరావత్ సురేష్ నాయక్ మాజీ సర్పంచ్ పసునూరి మధుసూదన్ దళిత రత్న అవార్డు గ్రహీతఅందే యాకయ్య మరియు సీనియర్ నాయకులు ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై సతీష్ అన్నకు పుష్పగుచ్చాలు, శాలువాలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు ప్రజా సేవే పరమావధిగా నిరంతరం ప్రజల కోసం కృషి చేస్తున్న సతీష్ మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో నిండి నూరేళ్లు జీవించాలని అందరూ మన స్ఫూర్తిగా ఆకాంక్షించారు ప్రజల ఆశీర్వాదమే బలం... కాంగ్రెస్ కుటుంబమే అండ... సేవా మార్గంలో మరిన్ని విజయాలు సాధించాలని హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న ప్రజాప్రతినిధులు పార్టీ ముఖ్యులు పాల్గొన్నారు.

# ఆచార్య జయశంకర్ ఆశయాల సాధనకు కృషి చేయాలి

### కలెక్టర్ హరిత

**ప్రజా వాయిస్, ఆసిఫాబాద్ :** ఆసిఫాబాద్ జిల్లా తెలంగాణ రాష్ట్ర సాధనకు తన జీవితాన్ని అంకితం చేసి ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జయశంకర్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్ తదితరులతో కలిసి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జయశంకర్ ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, చూపిన మార్గంలో ముందుకు సాగడం ద్వారా తెలంగాణ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్‌తో మూల మధుగౌడ్ భేటీ

**ప్రజా వాయిస్, ఆసిఫాబాద్ :** ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి అజ్మీర శ్యాంనాయక్‌ను మాజీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మూల మధుగౌడ్, భవానీ సేన్ హైదరాబాద్‌లోని నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు.
ఈ సందర్భంగా ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ సంస్థాగత బలోపేతం, గ్రామస్థాయిలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసే కార్యాచరణ, ప్రజా సమస్యల పరిష్కారంపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మరింత చేరువ కావాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే దిశగా కృషి చేయాలని అభిప్రాయపడ్డారు. అజ్మీర శ్యాంనాయక్ ప్రస్తుతం ఆసిఫాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



## ప్రభుత్వ పాఠశాలలే విద్యకు బంగారు బాట.. విద్యార్థులకు బూట్లు, యూనిఫాంల పంపిణీ



**ప్రజా వాయిస్ / మోమిన్‌పేట్ :** మోమిన్‌పేట్ మండలంలోని దుర్గంచెరువు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం సర్పంచ్ లావణ్య మోహన్ ఆధ్వర్యంలో ప్రభుత్వం అందించిన బూట్లు, యూనిఫాంలను విద్యార్థులకు పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా సర్పంచ్ లావణ్య మోహన్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల వైపు కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించి ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.
ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ లాల్ మహమ్మద్, ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, మహిళా అధ్యక్షురాలు యాదమ్మ, నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 10 జైల్ భరోను విజయవంతం చేయాలి

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్ :** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న నిర్వహించే దేశవ్యాప్త జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం దినాకర్ పిలుపునిచ్చారు. వాంకిడిలో కరపత్రాలను విడుదల చేసి మాట్లాడిన వారు, జిల్లాలోని గ్రామాలు, మండలాలు, మున్సిపల్ కేంద్రాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, రైతులకు గిట్టుబాటు ధర, ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.





## ఆదివాసీల సంక్షేమమే పోలీసుల లక్ష్యం

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్ :** ఆసిఫాబాద్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 'పోలీసులు మీకోసం' కార్యక్రమంలో ఎస్పీ నితికా పంత్ ఆదివాసి పటేళ్లు, నాయకులు, రాయి సెంటర్ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆదివాసి సంస్కృతి, సంప్రదాయాలు గౌరవప్రదమైనవని, గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణలో ఆదివాసి నాయకుల సహకారం కీలకమని అన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల రవాణా, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. జైనూర్‌లో ప్రతి వారం ప్రత్యేక పోలీస్ ప్రజావాణి నిర్వహించడంతో పాటు, పోలీస్ నియామకాలకు సిద్ధమవుతున్న ఆదివాసి యువతకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందిస్తామని తెలిపారు. సమావేశంలో ఆదివాసి నాయకులు గ్రామాల సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకురాగా, సంబంధిత శాఖలతో సమన్వయం చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీ అశోక్, పోలీసు అధికారులు, ఆదివాసి నాయకులు పాల్గొన్నారు.

## జేత్వాన్‌లో గద్దర్ 3వ వర్ధంతి నివాళులు



**ప్రజా వాయిస్, ఆసిఫాబాద్ :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా, వాంకిడి మండలం: జేత్వాన్‌లో గురువారం తెలంగాణ యుద్ధ నౌక గద్దర్ 3వ వర్ధంతిని భారతీయ బౌద్ధ మహా సభ, అంబేడ్కర్ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి, మౌనం పాటించి నివాళులర్పించారు. గద్దర్ ఉద్యమాలు అణగారిన వర్గాల ప్రజలను మేలుకొల్పడానికి ఉపయోగపడ్డాయని, ఆట పాటలు ప్రజల్లో ప్రశ్నించే ధైర్యాన్ని నింపాయని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా అధ్యక్షులు డాక్టర్ అశోక్ మహుల్కర్, వర్ష వాస్ కమిటీ అధ్యక్షులు దుర్గం శ్యామ్ రావు, సమత సైనిక్ దళ్ జిల్లా ఆర్గనైజర్ రోషన్ ఉప్రే, మండల అధ్యక్షులు దుర్గం దుర్గాజీ, సమాజ అధ్యక్షులు దుర్గం లహుజి శ్యామ్ రావు, రాజేశ్వర్ ఉప్రే, వర్ష వాస్ కమిటీ కార్యదర్శి దుర్గం దీపక్, అంబెడ్కర్ సంఘం కోశాధికారి ఉప్రే నాగ్ సేన్, నాయకులు విఠల్ చునార్కార్, దుర్గం శ్రీనివాస్, బౌద్ధ ఉపాసకులు పాండు జాడే, ఉప్రే ధర్మా, దుర్గం యేశ్వాంత్ పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సర్దుబాటు పారదర్శకంగా జరగాలి

### అదనపు కలెక్టర్



**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్ :** ఆసిఫాబాద్ జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు (రేషనలైజేషన్) ప్రక్రియను ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మార్మాట్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ, ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను కేటాయించి నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్దుబాటు ప్రక్రియలో ప్రభుత్వ నిబంధనలు, సీనియారిటీ, విద్యార్థుల సంఖ్యను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి సచ్చిదానంద చారి, జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాస్, జిల్లాలోని మండల విద్యాధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూముల ఆక్రమణపై కఠిన చర్యలు



**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్ :** కాగజ్‌నగర్ మండలం ప్రభుత్వ భూములను ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ కె. హరిత హెచ్చరించారు. గురువారం కాగజ్‌నగర్ మండలం కోసిని గ్రామ శివారులోని ప్రభుత్వ భూములతో పాటు మున్సిపల్ పరిధిలో రహదారి, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించి ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మధుకర్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రం లో తల్లిపాల ప్రాధాన్యం పై అవగాహన

### తల్లిపాలు బిడ్డకు వరం

**ప్రజా వాయిస్:** చిగురుమామిడి మండలం సీతారాంపూర్ గ్రామంలో అంగన్వాడీ సెంటర్లో తల్లిపాల వారోత్సవాలగురించి అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించరు ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోగురిలక్ష్మి మాట్లాడుతూ. శిశువు పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించాలని. తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే అందించాలని సూచించారు. తల్లిపాలు శిశువుకు సంపూర్ణ పోషకాహారంతో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని తెలిపారు. గర్భిణీలు. బాలింతలు. మహిళలకు తల్లిపాల ప్రాముఖ్యత. సమతుల్య పోషకాహారం. శిశు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. తల్లిపాల వల్ల తల్లి.బిడ్డ ఇద్దరు ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమాలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఇస్రత్ సుల్తానా. అంగన్వాడీ టీచర్ వరలక్ష్మి. సరోజన . ఆశ వర్కర్ తార. మరియు మహిళలు స్థానికులు పాల్గొన్నారు..



## భూమి వివాదం కేసులో వ్యక్తికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్

**ప్రజా వాయిస్ / మోమిన్‌పేట్ :** మోమిన్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన భూమి వివాదం, బెదిరింపుల కేసులో బూర్గుపల్లి గ్రామానికి చెందిన మేకల శ్రీనివాస్‌ను పోలీసులు గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు.
పోలీసుల వివరాల ప్రకారం, జూలై 27న మేకల శ్రీనివాస్, మేకల నగేష్, మేకల శోభారాణి కలిసి మంతెన కృష్ణంరాజు భూమిలోకి అక్రమంగా ప్రవేశించి, సాగు చేయకుండా అడ్డుకోవడంతో పాటు బెదిరించినట్లు ఫిర్యాదు నమోదైంది. ఇదే భూమి వివాదానికి సంబంధించి గతంలో కూడా వీరిపై పలు కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.
అరెస్టు చేసిన మేకల శ్రీనివాస్‌ను వికారాబాద్ అదనపు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, కోర్టు ఆయనకు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. అనంతరం ఆయనను జిల్లా కారాగారానికి తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.



## ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్ హరిత



**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్ :** ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాంను జిల్లా కలెక్టర్ కె. హరిత గురువారం సాధారణ తనిఖీలో భాగంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంల భద్రత, సీసీటీవీ నిఘా, అగ్నిమాపక పరికరాలు, ద్వంద్వ తాళాల వ్యవస్థ, నిర్వహణ విధానాలను తనిఖీ చేసి అధికారులకు సూచనలు చేశారు.
భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఈవీఎంల భద్రతలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. అలాగే గోదాంలో నిర్వహిస్తున్న రికార్డులు, ప్రవేశ–నిష్క్రమణ వివరాలను కూడా పరిశీలించారు.

## ఖాతాదారుడి కుటుంబానికి ఆర్థిక భరోసా



**ప్రజా వాయిస్ దౌల్తాబాద్:** యూనియన్ బ్యాంక్ రూపే డెబిట్ కార్డు ప్రమాద బీమా పథకం బాధిత కుటుంబానికి అండగా నిలిచిందని యూనియన్ బ్యాంక్ మేనేజర్ విశ్వనాథ్ రెడ్డి అన్నారు. దౌల్తాబాద్ మండలం లింగరాజుపల్లి గ్రామానికి చెందిన సున్నం బుచ్చయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన భార్య కవితకు రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రూపే డెబిట్ కార్డు కలిగిన ఖాతాదారులు బ్యాంకు నిబంధనల ప్రకారం వ్యక్తిగత ప్రమాద బీమా ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఖాతాదారులు తమ డెబిట్ కార్డులను సక్రమంగా వినియోగిస్తూ, వాటికి సంబంధించిన బీమా సదుపాయాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మార్చి 10న ధర్మారం చౌరస్తాలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన యూనియన్ బ్యాంక్ రూపే డెబిట్ కార్డును వినియోగిస్తున్నందున, ఆ కార్డుకు అనుబంధంగా ఉన్న ప్రమాద బీమా పథకం కింద రూ.2 లక్షల బీమా మంజూరైందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీదేవి, సబ్ మేనేజర్ ఉదయ్ కుమార్, క్యాషియర్ అరుణ జ్యోతి, స్పెషల్ ఆఫీసర్ కృష్ణారావు, తొగుట సీఎఫ్ఎల్ కౌన్సిలర్ స్వామి, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

## కిష్టాపూర్ అంగన్‌వాడీలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు

**ప్రజా వాయిస్, చిన్నకోడూరు :** ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని చిన్నకోడూరు మండలం కిష్టాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలు, బాలింతలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. తల్లిపాలు శిశువుకు తొలి రక్షణ కవచంలా పనిచేస్తాయని పేర్కొన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లిపాలు ఇవ్వడం వల్ల సంపూర్ణ పోషకాలతో పాటు, వ్యాధులపై పోరాడే సహజ రోగనిరోధక శక్తి లభిస్తుందని వివరించారు. తొలి 6 నెలలు: శిశువుకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి.రెండేళ్ల వరకు ఆరు నెలల తర్వాత అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలు అందించాలి.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, ఐసీడీఎస్ సూపర్వైజర్ మహాలక్ష్మి, సీఆర్పీ రజిత, అంగన్వాడీ టీచర్ కనకతార, ఆయా మంజూల, ఆశా వర్కర్ సంకీర్తనతో పాటు స్థానిక గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బొమ్మలరామారం మండలంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం సమావేశం

- మండల అధ్యక్షుడిగా చిలువేరు రాజమల్లారెడ్డి , జిల్లా సహాయ కార్యదర్శిగా సానాల చంద్రమౌళి నియామకం

**ప్రజా వాయిస్,యాదాద్రి భువనగిరి జిల్లా , బొమ్మలరామారం:** బొమ్మలరామారం మండల కేంద్రానికి తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూస శ్రీనివాస్ విచ్చేశారు. ఈ సందర్భంగా 2001 నుంచి తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పనిచేస్తున్న ఉద్యమకారులను గుర్తిస్తూ, తెలంగాణ ఉద్యమకారుల సంఘం బొమ్మలరామారం మండల అధ్యక్షుడిగా చిలువేరు రాజమల్లారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శిగా సానాల చంద్రమౌళిలను పూస శ్రీనివాస్ ప్రకటించారు.

ఈ సందర్భంగా పూస శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమకారుల సమస్యలు, డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం ఉద్యమకారుల సంఘం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఉద్యమకారుల హక్కుల పరిరక్షణకు తమ సంఘం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చీర సత్యనారాయణ, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు పాలగాని వెంకటేష్ గౌడ్, బీజేపీ సీనియర్ నాయకులు రంగా రామాగౌడ్, సీపీఐ మండల కార్యదర్శి అన్నెబోయిన వెంకటేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేష్ పైలట్, సింగిల్ విండో చైర్మన్ సింగిర్తి మల్లేష్, ఆత్మ కమిటీ చైర్మన్ ఎనగండ్ల సుధాకర్, మండల సర్పంచ్–ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు దాసరి సూర్యప్రకాశ్ రెడ్డి, మైలారం సుదర్శన్, కట్టా శ్రీకాంత్, శ్రీరాములు నాయక్, మన్నె శ్రీధర్, మర్రి కృష్ణారెడ్డి, మర్రి భగవంత్ రెడ్డి, సోలిపేట సర్పంచ్ పావని ఇంద్రసేనా రెడ్డి, ఎర్ర హేమంత్ రెడ్డి, బోనంకూర సుదర్శన్, పూడూరి ఆంజనేయులు, మాందాల రామకృష్ణ, జూపల్లి శ్రీకాంత్, పల్లె కృష్ణగౌడ్, ఊట్ల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజల మనిషి ప్రజాయుద్ధనౌక గద్దర్...

- మూడవ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు...
- ప్రముఖ కవి డా,,కొమిరేసాకీ...



**ప్రజా వాయిస్, బయ్యారం :** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ అమర వీరుల స్తూపం వద్ద గద్దర్ మూడవ వర్ధంతి సందర్భంగా జంపాల చక్రధర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గాయకుడు ,రచయిత కొమిరె సాకీ గద్దర్ కు ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం కొమిరె సాకీ మాట్లాడుతూ, ఎవరి కష్ట ఫలితం వారికి దక్కేలా, ఒక్క మనుషులే కాదు సమస్త జీవరాశులూ ఒక్కమాటలో చెప్పాలంటే స్వేచ్ఛగా జీవించగలిగే సమసమాజ స్థాపనే ధ్యేయంగా దళిత,పీడిత ప్రజల శత్రువులే తన శత్రువులుగా గద్దరన్న ప్రయాణం సుదీర్ఘమైనదని.త్యాగాలతో మాత్రమే ఈ లక్ష్యసాధన సాధ్యమని ప్రాణత్యాగం సైతం అనివార్యమని శత్రులెవరో మిత్రులెవరో కూడా గద్దరన్నకు స్పష్టమేననీ తెలిపారు.గద్దరన్న చివరాంకంలో విప్లవోద్యమ సైద్ధాంతిక భిన్నాభిప్రాయంతో బయటికి వెళ్లినప్పటికీ నూటికి 90% ఉన్న మూగజీవుల ఆర్తిని ఆవేదననీ కష్టసుఖాల్ని పలికే ప్రచార సాధనంగానే గద్దర్ అస్తిత్వ ప్రయాణం సాగిందని అన్నారు ప్రపంచ సాహితీ సాంస్కృతిక చరిత్రలో ఒక అపురూప సన్నివేశం గా ,భారతదేశ ప్రత్యామ్నాయ ప్రజాస్వామిక ఉద్యమాలనుంచి ఉవ్వెత్తున ఎగిసిపడిన కళాకెరటంగా గహఅసమానతల అంతం కోసం సాగిన అలుపెరగని గొంతుకని కొనియాడారు. అనేకానేక రూపాల్లో ఉన్న దోపిడీ వ్యవస్థ పైన ఎక్కుపెట్టిన ప్రజాయుద్ధం పాట.మహోత్తర మార్పు కోసం చావుని కూడా లెక్కచేయని త్యాగజీవితం. ప్రపంచ ప్రజాపాటనే శాసించిన జిమ్మేదారి కోయిల గద్దర్ అంటేనే పోరు బాట.సజీవ ప్రజాజీవన భాణీయని అన్నారు

గద్దర్ ఆధునిక జానపదీయుడు, రాజకీయ వచనాకారుడు, వర్తమాన జీవన పోరాట తాత్వికుడు. మౌఖిక సాహిత్య దృశ్యకవి. శ్రామిక సంగీత సాధకుడు. నిత్య కాలజ్ఞాన సంభాషికుడు. సంస్కృతికి, సాహిత్యానికి,సంగీతానికి, జీవితానికి, పోరాటానికి మధ్య గీతలు చెరిపేసి, తానే అన్నీఐపోయి ప్రజా రంగస్థలంపై ఈ దేశం సామూహిక సామాజిక ఆత్మని అభినయంతో ఆవిష్కరించిన అరుదైన వీధి బాగోతికుడు.గద్దర్ భారతీయ ప్రజాసాహితీ సంస్కృతిని విప్లవగానం చేసిన ప్రజావాగ్గేయకారుడని శ్లాఘించారు గద్దర్ ఈ దేశ సాహితీ సాంస్కృతిక పరంపర జ్ఞానగానం. వేమన నీతి పలుకువి, వీరబ్రహ్మం కాలజ్ఞాన వాక్కువి, కబీర్ దోహావి, రవిదాస్ బేగం పురానివి, తుకారం ఏక్ తారావి, ఒగ్గు కథకుడి గొంగళివి, డెక్కలోళ్ళ జమడికవి, వీరుల యక్షగానానివి, యానాదుల వీధి బాగోతికుడివి, పింజారి నాజర్ బుర్రకథవి,మండే మాదిగ డప్పువి,ఆదివాసీల రేలారేలనృత్యానివి, లంబాడీల హోలియా హోలీవి, ముస్లిం సలాముల కవ్వాలీవి, అంటరాని వసంత గీతానివి,ఇన్నిన్ని జానపదరీతుల సహజ సంగీత సంగమంగా సాగిన సామాజిక గమనానివి. ఈ దేశ జనజీవితాలన్నీ నీ పాటలే. కూలీలు,కార్మికులు, ఆదివాసీలు, దళితులు, స్త్రీలు, రైతులు, శ్రామికులు, చేతి వృత్తి వాళ్ళు ఒక్కరేమిటి భారతదేశ భాగ్యసీమలో భుక్తి దొరకని అభాగ్యులంతా నీ పాటలేగా అంటూ కీర్తించారు దండకారణ్యంలో, గోండుల గూడేల్లో రగల్ జెండా,ఆర్ఇసీలో, ఉస్మానియాలో, నిజాం కాలేజీలో, సెంట్రల్ యూనివర్సిటీలో, జేఎన్యూలో, నువ్వో ప్రజా విశ్వవిద్యాలయ పాఠానివిగా.. కారంచేడు కుల దురహంకారానికి ఎదురు నిలిచి గాండ్రించిన దళిత పులివి. చుండూరు రక్తక్షేత్రంలో ఏపుగా పెరిగిన వెదురు వనానివి. బొంబాయిలో,కలకత్తాలో, మద్రాస్ లో, ఈ దేశ ప్రధాన నగరాల్లో, మురికివాడల్లో, పల్లెల్లో, ఇరుకు గల్లీలో పోరెత్తి పారిన ప్రవాహ యుద్ధ గానానివి.

నువ్వు శ్రీకాకుళం,ఇంద్రవెల్లి, జగిత్యాల,కారంచేడు తెలంగాణా... చరిత్ర ప్రతీ మలుపులో నువ్వే.

గోచి గొంగళి చుట్టుకుని కాళ్లంతా పదాల గజ్జెలెట్టుకొని, ప్రజల జెండా కర్రతో ప్రదర్శనా సాము చేస్తూ, డప్పుల దరువుల మధ్య, జనం గుండె చప్పుళ్ళని అలుపెరగని ఆటపాటలతో, సిరిమల్లె పువ్వులా పలకరింతలతో, చెదిరిన జుట్టుని కూడా 'హో' దిక్కారంతో తలెగరేస్తూ నిండు ఆత్మగౌరవ పోటెత్తిన పోరు హోరువోలే ఎంత చక్కగున్నావే అందమైన అంటరాని ఆత్మీయుడవై..జనం గుండెల్లో ప్రజాచరణమై పల్లవిస్తుంటావులే!!

**చావు అంచు మీద కూడా గద్దరన్న ప్రజాపాట కొనసాగింపుకోసం ఎంత వెంపర్లాడావోకదా!**

"మూగబొయిన గొంతులో రాగమెవరు తీసేదరో..ఆ చిన్నబొయిన సేతి కర్రతో సాము ఎవరు చేసేదరో "..

**ఆ తుపాకులకు ఎదురు నడిసినా.. తూట ఎవరు దాసెదరో..**

**ఆతూట ఎవరు దాసెదరో "....**

ఇలా గద్దరన్న తెలుగు సమాజంలో మమేకమైన పేరు. ప్రపంచ మహాకవి, పోరాట యోధుడు, సంగీత సాగరుడా నీ నిలువెత్తు గాయాల గేయం ముందు నంది అవార్డులు, జ్ఞానపీటలు, నోబెల్, గ్రామీస్, ఆస్కార్లు దిగదుడిపే. ప్రపంచ పీడిత ప్రజల్లో ఎప్పటికీ నిలిచిపోయే నీ పాటని అందుకోలేని తూకపురాళ్లు, తీర్పురాయుల్లు చారిత్రక మరుగుజ్జులుగానే మిగిలిపోతాడన్నారు

గద్దరన్న జననాట్యమండలిగా, ప్రజా కళామండలిగా, విప్లవ వీరుడిగా, దళిత గర్జనగా, మాదిగ హక్కుల దండోరాగా, నీలి జెండాగా, తెలంగాణ ధూంధాం గా, మహాకవిగా, ప్రజావాగ్గేయకారుడిగా, రాజకీయ కామెంటేటర్గా, సాంస్కృతిక సేనానిగా, పౌరహక్కుల నాయకుడిగా, శాంతి దూతగా, రాజ్యాంగ పరిరక్షకుడిగా, పంచశీల పరివ్రాజకుడిగా ప్రజల్లో వెలిగావు. నువ్వు నడుస్తున్న ప్రపంచ చరిత్రవు. నీవు ప్రజాజీవితానివి, గాయానివి, పోరాటానివి, మనిషితనానివి,విముక్తి సందేశానివి,అంటరాని ఆత్మగౌరవానివి. నీ పాటలేనిమేంలేం. ఓ బహుజన కెరటమా ఈ పీడిత ప్రజల గుండెల్లో ఎల్లప్పుడూ విముక్తి గీతమై నిలిచే ఉంటావు. అని వారన్నారు.

ప్రజాస్వామిక ప్రత్యేక తెలంగాణా సాధనే లక్ష్యంతో సామాజిక న్యాయశక్తులు,విప్లవ శక్తుల ఉమ్మడి ఆకాంక్షల వేదికలో, పీడిత,తాడిత బహుజనం గొంతుగా నిలిచి తెలంగాణ ప్రజాఫ్రంట్ తొలి అధ్యక్షులుగా, కొంతకాలం భాగస్వామ్యంగా పనిచేసిన గద్దరన్నకు మూడవ వర్ధంతి సందర్భంగా వినమ్రంగా నివాళులు.జోహార్లు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి ఉద్యమకారులు చిత్తారి సోమన్న,జెర్రీ పోతుల వెంకన్న,గుదె విరన్న,నిలేష్ రాయ్, గంధసిరి వేణు, ముంజల రాజేందర్, గండి,వీరేందర్, నూనె శ్రీనివాస్, సామెల్, మాదర బోయిన యాకయ్య, తదితరులు పాల్గొన్నారు..

## తెలంగాణ ఉద్యమానికి మార్గదర్శి ప్రొఫెసర్ జయశంకర్

- ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి
- మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్



**ప్రజావాయిస్, జిన్నారం :** తెలంగాణ ఉద్యమానికి మార్గదర్శి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సేవలు చిరస్మరణీయమని గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం గుమ్మడిదల మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుమార్ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంలో ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర ఎనలేనిదని అన్నారు. తెలంగాణ సమాజ ఆకాంక్షలను దేశ వ్యాప్తంగా వినిపిస్తూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు ఆయన చేసిన కృషి భావితరాలకు ఆదర్శమని కొనియాడారు. ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని, సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దశరథ్, వార్డు కౌన్సిలర్లు రమేష్, కుమార్ గౌడ్, సంజీవరెడ్డి, రాజశేఖర్, కిషన్, నాయకులు వెంకట్రాంరెడ్డి, సత్యనారాయణ, హుస్సేన్, శ్రీనివాస్ రెడ్డి, శేఖర్ రెడ్డి, కృష్ణ, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు.

## బాధిత కుటుంబానికి అండగా నిలిచిన సామాజికవేత్త సబ్బాని వెంకట్

**ప్రజా వాయిస్ సైదాపూర్:** ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) నాయకుడు, సైదాపూర్ మండలం రామచంద్రపురం గ్రామానికి చెందిన కొయ్యడ మధు కుటుంబాన్ని సామాజికవేత్త సబ్బాని వెంకట్ పరామర్శించారు. ఈ ప్రమాదంలో మధు మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన ఆయన కుమార్తె వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. చిన్నారికి కుడి చేయి, కుడి కాలు ఎముకలు విరగడంతో పాటు బి గ్రూప్ రక్తం అవసరమని తెలుసుకున్న సబ్బాని వెంకట్ స్వయంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు.

అనంతరం ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి చిన్నారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు, తగిన సహాయ సహకారాలు అందించారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబానికి మానసికంగా, ఆర్థికంగా అండగా నిలుస్తూ 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. తమ కుటుంబానికి కష్టకాలంలో అన్ని విధాలుగా అండగా నిలిచి భరోసా కల్పించిన సబ్బాని వెంకట్‌కు గ్రామస్తులు మరియు కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



## ముల్కనూర్ గ్రామంలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం

**ప్రజా వాయిస్, చిగురుమామిడి :** ముల్కనూర్ గ్రామ అభివృద్ధిలో భాగంగా భావండ్ల కొమురయ్య ఇంటి నుండి ఆర్ & బి రోడ్డు వరకు నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను గ్రామ సర్పంచ్ శ్రీమతి సాంబారి భారతమ్మ కొమురయ్య కొబ్బరికాయ కొట్టి ఘనంగా ప్రారంభించారు.

ఎస్సీ–ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల ద్వారా రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఈ సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఆ గల్లీ నివాసితులకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారనున్నాయి. వర్షాకాలంలో బురద సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు, గల్లీ పరిశుభ్రంగా ఉండి ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారనుంది.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీమతి సాంబారి భారతమ్మ కొమురయ్య మాట్లాడుతూ గ్రామ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు గ్రామ అభివృద్ధి పనులను నిరంతరం చేపడుతున్నామని తెలిపారు. ఈ సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఆ గల్లీ నివాసితులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డి.వై.ఈ.ఈ.మంజుల భార్గవి, ఏఈ నిరంజన్ రెడ్డి, ఉప సర్పంచ్ పైడిపల్లి వెంకటేష్, వార్డు సభ్యులు గట్టు రేణుక, వంగల రాము, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## కోహెడ మండలంలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల మెరుపు దాడి... ట్రాక్టర్ సీజ్



**ప్రజా వాయిస్ కోహెడ :** కోహెడ మండలంలోని కూరెళ్ళ గ్రామ శివారులో మోయ తుమ్మెద వాగు నుండి జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలు మరియు రవాణాపై కోహెడ పోలీసులు నిఘా పెట్టి మెరుపు దాడి నిర్వహించారు. అందిన నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు కూరెళ్ళ గ్రామ శివారులో తనిఖీలు చేపట్టగా, ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

ఈ ఘటనకు సంబంధించి కూరెళ్ళ గ్రామానికి చెందిన బుర్ర రాకేష్ తండ్రి రమేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టుబడిన ట్రాక్టర్ (రిజిస్ట్రేషన్ నంబర్లు TG-36-A-8278, ట్రైలర్ TG-36-A-8277) ఇసుకతో సహా కోహెడ పోలీస్ స్టేషన్‌కు తరలించబడింది. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అక్రమ ఇసుక రవాణాకు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని, తప్పు చేసిన వారికి జైలు శిక్ష కూడా తప్పదని కోహెడ ఎస్ ఐ పి అభిలాష్ హెచ్చరించారు. మండలంలో ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపుతామని, ఈ రకమైన అక్రమ కార్యకలాపాలను సహించేది లేదని పోలీసులు స్పష్టం చేశారు.

## ఆన్లైన్ గేమ్స్ పేరుతో సైబర్ మోసాలు....

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## ముల్కనూర్ ఎస్సై రాజు

**ప్రజా వాయిస్, భీమదేవరపల్లి :** మండలంలో ఇటీవల ఆన్లైన్ గేమ్స్ పేరుతో సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో యువత, విద్యార్థులు,ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ముల్కనూరు ఎస్సై రాజు సూచించారు .తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు వస్తుందని ఆశను ఆసరా చేసుకొని గేమింగ్ ఆప్స్, టెలిగ్రామ్ లింకులు , సోషల్ మీడియా ప్రకటనల ద్వారా సైబర్ నేరగాళ్ళు మోసాలకు పాల్పడుతున్నారని ఆయన తెలిపారు. తెలియని లింకులను క్లిక్ చేయవద్దని, గుర్తు తెలియని యాప్లను డౌన్లోడ్ చేయకుండా ఉండాలని సూచించారు. ఏదైనా పెట్టుబడి పెట్టేముందు సంబంధిత సంస్థ లేదా యాప్ విశ్వసనీయత పూర్తిగా ధ్రువీకరించుకోవాలని చెప్పారు. అలాగే బ్యాంకు ఖాతా వివరాలు కానీ OTP, UPI PIN వంటి రహస్య సమాచారాన్ని ఎట్టి పరిస్థితులను ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 హెల్ప్ లైన్ కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని అలాగే cybercrime.gov.in ఆన్లైన్ లో కూడా ఫిర్యాదు చేయొచ్చని ఎస్ఐ రాజు తెలిపారు .ప్రజల అప్రమత్తదే సైబర్ నేరాలు అడ్డుకునేందుకు అరికట్టేందుకు అత్యంత ప్రభావంతమైన ఆయుధమని ఆయన పేర్కొన్నారు .

